http://www.agnidharanews.com

# అగ్నిధార

శనివారం 25 అక్టోబర్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

**విలేకరులు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం

# స్పీడ్ పెంచిన పార్టీలు

- నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో ప్రచారంలో స్పీడ్ పెంచాలని అన్ని రాజకీయ పార్టీలు నిర్ణయం
- ఏడు డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ప్రచారం చేయాలని కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశం
- ఎన్నికల ప్రచారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలకి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది

హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం శనివారం నుంచి హోరెత్తనుంది. నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో ప్రచారంలో స్పీడ్ పెంచాలని అన్ని రాజకీయ పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఏడు డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ప్రచారం చేయాలని కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశించింది. ఎన్నికల ప్రచారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలకి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలోనే సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచార బాధ్యతలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పలువురు కీలక నేతలకు అప్పగించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై నిన్న (గురువారం) ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో ఆ పార్టీ నేతలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం నుంచి నందినగర్‌లోనే కేసీఆర్ ఉండి ఎన్నికల ప్రచార సరళిని సమీక్షించనున్నట్లు సమాచారం. ఎన్నికలు అయ్యే వరకు నందినగర్‌లోనే ఉండాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక్కడే ఉండి ఎన్నికల ప్రచార వ్యూహాన్ని పర్యవేక్షించనున్నారు కేసీఆర్. అలాగే, ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనుంది టీబీజేపీ. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ కుమార్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీజేపీ ప్రచారానికి ఉత్తరప్రదేశ్ , గోవా రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.






## భారత్ తరహాలో ఆఫ్ఘనిస్తాన్ చర్యలు

- కాబుల్ నదిపై డ్యామ్‌ల నిర్మాణం
- పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకున్న విషయం తెలిసిందే.
- ప్రస్తుతం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తల పరిస్థితులు
- కునార్ నదిపై వీలైనంత త్వరగా డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు

# నిద్రలోనే సజీవ దహనం

- కర్నూలు బస్సు ప్రమాదం..
- మృతదేహాలకు ప్రమాదస్థలి వద్దే డీఏన్ఏ, పోస్టుమారం టెస్టులు
- కర్నూలు సమీపంలో ప్రైవేట్ బస్సులో ఘోర అగ్నిప్రమాదం
- ప్రమాదంలో సుమారు 20 మంది ప్రయాణికులు సజీవ దహనం
- గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలు, ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం
- డీఎన్ఏ పరీక్షల రిపోర్టుల ఆధారంగా మృతదేహాల అప్పగింత
- నలుగురు క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స
- మృతులకు కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం.. ఒక్కొక్కరికి..



హైదరాబాద్/కర్నూలు

కర్నూలు సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో జరిగిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో సుమారు 20 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతుండగా, మృతదేహాలను వెలికితీశారు. అయితే, మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో, ఘటనా స్థలంలోనే వైద్య బృందాలు పోస్టుమార్టంతో పాటు డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలను సేకరిస్తున్నాయి. డీఎన్ఏ రిపోర్టులు వచ్చిన - మిగతా3లో

# విద్య రాని వ్యక్తి విద్యా శాఖ మంత్రి

- సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు
- కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు
- జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను
- భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు.
- మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది

హైదరాబాద్

విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. - మిగతా3లో





## నీతీశ్ కుమార్ నాయకత్వంలో అన్ని రికార్డులను బ్రేక్ చేస్తుంది

- యువతకు సాధికారత కల్పించడమే మా కూటమి ప్రాధాన్యం
- ఫెస్టివల్ సీజన్‌లో ఆఫర్ లెటర్స్ అందుకోవడం వేడుకలను రెట్టింపు చేస్తుంది
- ఈ రోజు 51 వేల మంది యువత ఆ ఆనందాన్ని పొందుతున్నారు
- ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన మోదీ

## ఏపీలో ఘోర బస్సు ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ డిమాండ్
- కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది మృతి
- ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే డిమాండ్
- ఇది నిర్లక్ష్యం లేదా కుట్ర అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసిన శివకుమార్
- గతవారం ఇలాంటి ఘటనే జరిగినా చర్యలు తీసుకోలేదని ఆరోపణ



# కేసులు పెట్టి లోపలేస్తాం

- ట్రావెల్స్ యజమానులకు మంత్రి పొన్నం వార్నింగ్..
- కర్నూలు ఘటనపై సమగ్ర విచారణ జరపాలి
- బస్సుల్లో భద్రతా చర్యలపై నిర్ణయాలు తీసుకుంటాం
- రవాణా శాఖ తనిఖీలు చేస్తే వేధింపులని ట్రావెల్స్ యజమానులు ఆరోపిస్తున్నారు

హైదరాబాద్

కర్నూల్ జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదం నేపథ్యంలో ట్రావెల్స్ యజమానులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరికలు జారీ చేశారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. బస్సు యజమానుల నిర్లక్ష్యం వల్ల ఏదైనా జరిగితే.. హత్య నేరం కింద కేసులు పెట్టి లోపలేస్తామని మంత్రి పొన్నం హెచ్చరించారు. స్పీడ్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, ప్రయాణికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని సూచించారు. రవాణా శాఖ తనిఖీలు చేస్తే - మిగతా3లో





## ఉగ్ర నిరోధక చట్టాలను దుర్వినియోగం చేస్తున్న పాక్

- మానవహక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ఆందోళన
- 1997 ఉగ్రవాద నిరోధక చట్టం కింద బలోచ్‌కు చెందిన 32 మందిని పాక్ తన వాచ్‌లిస్ట్‌లో చేర్చడాన్ని తప్పుబట్టింది.
- ప్రత్యేక దేశం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న బలోచ్ ప్రజలను పాక్ ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తోంది

## స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన

- తీవ్రంగా స్పందించిన జైశంకర్
- మైనార్టీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడాలన్న ఐరాస
- ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవన్న జైశంకర్
- ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని వ్యాఖ్య



# భారత్ తరహాలో ఆఫ్ఘనిస్తాన్ చర్యలు

**న్యూఢిల్లీ:** పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ అడుగుజాడల్లోనే ఆఫ్ఘనిస్తాన్ నడుస్తోంది. ప్రస్తుతం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తల పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించి కునార్/కాబుల్ నది నీటి ప్రవాహాన్ని అడ్డుకునేందుకు ఆఫ్ఘనిస్థాన్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. కునార్ నదిపై వీలైనంత త్వరగా డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. సుప్రీం నేత మౌలావి హిబాతుల్లా అకుండజాద ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. జలశాఖ మంత్రి ముల్లా అబ్దుల్ లతిఫ్ మన్సూర్ ఎక్స్‌లో రియాక్ట్ అయ్యారు. స్వంత జాలలను నియంత్రించుకునే హక్కు ఆఫ్ఘన్లకు ఉందన్నారు. స్వదేశీ కంపెనీలే ఆ నది సమీపంలో నిర్మాణాలు చేపడుతాయన్నారు. పాక్, ఆఫ్ఘన్ మధ్య ఉన్న డురాండ్ సరిహద్దుల్లో ప్రతి రోజు హింస చోటుచేసుంటకున్నది. ఆ బోర్డర్ సుమారు 2600 కిలోమీటర్ల దూరం ఉంటుంది. తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ ఉగ్ర సంస్థకు ఆఫ్ఘన్ మద్దతు ఇస్తున్నట్లు పాకిస్థాన్ ఆరోపించింది. అయితే ఘర్షణల నేపథ్యంలో తాలిబన్ కీలక నిర్ణయం తీసుకున్నది. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఎలాగైతే సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేశారు. ఆ తరహాలోనే ఆఫ్ఘనిస్థాన్ ముందుకు వెళ్లాలని డిసైడ్ అయ్యింది. పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫక్తున్వా ప్రావిన్సులో ఉన్న చిత్రాల్ జిల్లాలోని హిందూ కుష్ పర్వత శ్రేణుల నుంచి



కునార్ నది ప్రవహిస్తుంది. ఆ నది తొలుత దక్షిణ దిక్కుకు ప్రయాణిస్తుంది. కునార్, నాన్‌ఘర్ ప్రావిన్సు మీదుగా ప్రవహిస్తూ కాబూల్ నదిలో కలుస్తుంది. ఆ రెండు నదులకు తోడుగా పీచ్ నది కలుస్తుంది. ఇక ఆ మూడు నదులు కలిసి పాకిస్థాన్‌లో తూర్పు దిశగా ప్రవహిస్తాయి. పంజాబ్ ప్రావిన్సులోని అట్టాక్ సిటీలో సిందూ నదిలో అది కలుస్తుంది.

ఖైబర్ ఫక్తున్వా ప్రాంతంలో కాబుల్ నది కీలకమైంది. వ్యవసాయం, తాగు నీరు, విద్యుత్తు శక్తి జనరేషన్‌కు ఆ నీటినే వాడుతుంటారు. అయితే పాక్‌లోకి ప్రవేశించే ప్రాంతంలో ఆ నదిపై డ్యామ్‌లు నిర్మించాలని తాలిబన్ సర్కారు భావిస్తున్నట్లు తెలుస్తోంది

# నీతీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి అన్ని రికార్డులను బ్రేక్ చేస్తుంది

**సమస్తిపూర్:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలను అటు ఎన్డీయే.. ఇటు ఇండియా బ్లాక్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు సమస్తీపూర్ జిల్లాలోని కర్పూరీ గ్రామం అందుకు వేదికైంది. బిహార్ మాజీ సీఎం, దివంగత నేత కర్పూరీ ఠాకూర్ కు నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను కలిశారు. ఈ సందర్భంగా రోజ్‌గార్‌మేళాను ఉద్దేశించి ప్రసంగించారు. "యువతకు సాధికారత కల్పించడమే మా కూటమి ప్రాధాన్యం. ఫెస్టివల్ సీజన్‌లో ఆఫర్ లెటర్స్ అందుకోవడం వేడుకలను రెట్టింపు చేస్తుంది. ఈ రోజు 51 వేల మంది యువత ఆ ఆనందాన్ని పొందుతున్నారు. అది నాకు ఆనందాన్నిస్తోంది. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారికి కృతజ్ఞతలు" అని మోదీ అన్నారు. "తమ నాయకుడు తేజస్వీ యాదవ్ అని మరి మీ నేత ఎవరు" అంటూ ఇండియా బ్లాక్ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "నీతీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి అన్ని రికార్డులను బ్రేక్ చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తుంది" అని వెల్లడించారు. అధికార కూటమి సీఎం అభ్యర్థి నీతీశ్ అని మోదీ చెప్పడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

బిహార్ రాజకీయాల్లో కులం కీలక పాత్ర పోషిస్తుంది. ఎన్నికల ఫలితాలు నిర్ణయించడంలోనూ కుల సమీకరణాలదే ముఖ్య భూమిక. ఈ పరిస్థితిని మార్చేందుకు కొన్ని దశాబ్దాల క్రితమే పోరాడిన నేత కర్పూరీ ఠాకూర్. తన ఊరు పితౌంఝియాలో కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. అట్టడుగున ఉన్నవారిని రాజకీయంగా చైతన్య పరిచారు. ముఖ్యమంత్రి స్థాయికి చేరినా పూరి గుడిసెలోనే ఉండేవారు. బిహార్‌కు రెండు పర్యాయాలు (డిసెంబరు 1970 నుంచి జూన్ 1971 వరకు, డిసెంబరు 1977 నుంచి ఏప్రిల్ 1979 వరకు) సీఎంగా సేవలందించి తన పాలనా దక్షతతో జన నాయక్‌గా చెరగని



ముద్ర వేసుకున్నారు. గతేడాది ఆయన శత జయంతి వేళ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్నతో గౌరవించింది. మొదటిసారి నితీశ్ కుమార్‌ను ఎన్డీయే ప్రచార ముఖంగా ప్రస్తావించారు. అయితే, ఎన్నికల తర్వాత ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగుతారా? అనే విషయం స్పష్టంగా చెప్పలేదు. ఎక్కడా కూడా సీఎం అభ్యర్థి అనే మాట ప్రస్తావించకుండానే.. ఈసారి కూడా సీఎం నితీష్ కుమార్ నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్లబోతున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఎన్డీయే సీఎం అభ్యర్థి ఎవరో చెప్పాలం టూ తేజస్వి సవాల్‌పై ప్రధాని మోదీ స్పందించినట్లయింది. కాగా, బీజేపీ.. తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడంలో వెను కడుగు వేస్తోందంటూ మహాఘట్‌బంధన్ విమర్శించింది. సీఎం నితీశ్ కుమార్ పార్టీ జేడీ(యూ)ని ఖతం చేయడానికి బీజే పీ కుట్రలు సాగిస్తోందంటూ తేజస్వీ యాదవ్ నిప్పులు చెరి గిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లో నితీశ్‌ను సీఎం అభ్యర్థి గా ప్రకటించిన బీజేపీ ఈసారి ఎందుకు ప్రకటించడం లేదు? దీని వెనుక అసలు కారణం ఏమిటి?" అంటూ తేజస్వీ ధ్వజమెత్తారు.

# ఏపీలో ఘోర బస్సు ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి

కర్నూలు సమీపంలో జరిగిన ఘోర బస్సు అగ్నిప్రమాదంపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. 19 మంది ప్రయాణికులు సజీవదహనమైన ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దీని వెనుక కుట్ర లేదా నిర్లక్ష్యం ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బెంగళూరులోని విధానసౌధలో విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్, ఈ ఘటనపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "గతవారం కూడా బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే దగ్ధమైంది. నేను ఇటీవల రాయచూర్‌కు వెళ్లినప్పుడు, అక్కడి ప్రజలు నాకు ఆ వీడియో చూపించారు. ఆ బస్సులో మంటలు రాగానే మా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఒకరు డ్రైవర్‌ను పట్టుకుని గట్టిగా అరిచి హెచ్చరించడంతో ప్రయాణికులందరూ వెంటనే కిందికి దిగిపోయారు. ఆ బస్సులో సుమారు 20 మంది వైద్య విద్యార్థులు ఉన్నారు. అదృష్టవశాత్తు, స్వల్ప గాయాలతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. వారి ల్యాప్‌టాప్‌లు మాత్రం కాలిపోయాయి" అని ఆయన గుర్తుచేశారు. అంత పెద్ద ఘటన జరిగినా అధికారులు ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోలేదని, పోలీసులు కూడా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. తాజా ప్రమాదానికి గురైన బస్సు ఆపరేటర్ బెంగళూరుకు చెందిన వ్యక్తి కావడంతో, ఈ విషయంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి, హోం మంత్రి జి.పరమేశ్వరను ఆదేశించినట్లు శివకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తాజా దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని



ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వేణు ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. "నేను, మరికొంతమంది ప్రయాణికులు ఎమర్జెన్సీ డోర్ అద్దాన్ని పగలగొట్టి బయటకు దూకేశాం. కానీ, మా కళ్లెదుటే ఎంతోమంది మంటల్లో చిక్కుకుని చనిపోతుంటే ఏమీ చేయలేక నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాం" అని ఆవేదన వ్యక్తం చేశారు. సోదరిని చూసి తిరిగి బెంగళూరు వస్తుండగా %ూ%-13 సీటులో ప్రయాణిస్తున్నానని వేణు తెలిపారు. "తెల్లవారుజామున 3 గంటలకు బస్సు ఆగింది. మళ్లీ కదలడం మొదలైన కాసేపటికే ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టాయి. ఊపిరి ఆడలేదు. ఓ ప్రయాణికుడు తన చేతితో అద్దాన్ని పగలగొట్టాడు. అతనికి గాయమైనా, సుమారు 15 మంది బయటకు రావడానికి సాయం చేశాడు. బస్సు మొదట ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి, ఆ తర్వాత మంటల్లో చిక్కుకుంది. ఐదు మీటర్ల దూరంలో నిలబడి తోటి ప్రయాణికులు కాలిపోవడాన్ని చూడాల్సి వచ్చింది. గంట తర్వాత మరో బస్సులో బెంగళూరు చేరుకున్నాను" అని వేణు వివరించారు.

## ఉగ్ర నిరోధక చట్టాలను దుర్వినియోగం చేస్తున్న పాక్



ఉగ్రవాద నిరోధక చట్టాలను పాక్ దుర్వినియోగం చేస్తోందని మానవహక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చట్టాలను బలోచ్ ఉద్యమకారుల అణచివేతకు వాడుతోందని ఆరోపించింది. 1997 ఉగ్రవాద నిరోధక చట్టం కింద బలోచ్‌కు చెందిన 32 మందిని పాక్ తన వాచ్‌లిస్ట్‌లో చేర్చడాన్ని తప్పుబట్టింది. వారిలో ప్రత్యేక దేశం కోసం పోరాడే వారిని కూడా చేర్చిందని.. ఇది వారి హక్కులను పూర్తిగా కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమ్నెస్టీ దక్షిణాసియా రీజనల్ డైరెక్టర్ బాబూ రామ్ మాట్లాడుతూ.. ప్రత్యేక దేశం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న బలోచ్ ప్రజలను పాక్ ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తోందన్నారు. దీనివల్ల వారి స్వేచ్ఛ, గోప్యత, ఉద్యమానికి సంబంధించిన ప్రాథమిక హక్కులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

**అఫ్గాన్-పాక్ బోర్డర్ మూసివేత ఎఫెక్ట్..**
**కిలో టమాటా ధర 600 పాకిస్థానీ రూపాయలు**

పాక్ తన వాచ్‌లిస్ట్‌లో పలువురు మహిళా బలోచ్ కార్యకర్తల పేర్లను కూడా చేర్చి.. తన హద్దులను దాటిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనివల్ల వారు కఠినమైన పర్యవేక్షణ, ప్రయాణ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వారి బ్యాంకు ఖాతాలు కూడా ఫ్రీజ్ అవుతాయని పేర్కొంది. బలోచ్ ఉద్యమకారులకు వ్యతిరేకంగా పాక్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం కూడా వారికి లేకుండా ఉండేందుకు ఉగ్రవాద నిరోధక చట్టాలను ఉపయోగిస్తోందని తెలిపింది. పాక్ చేస్తున్న ఇటువంటి కుట్రలను అడ్డుకోవాలంటే అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు అనుగుణంగా ఆ దేశం ఉగ్రవాద నిరోధక చట్టాలను సవరించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. బలోచిస్థాన్ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడం కోసం బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఏర్పడింది. పాక్‌లోని అత్యధిక ఖనిజ నిల్వలున్న ప్రావిన్స్‌గా బలోచిస్థాన్‌ను పేర్కొంటారు. ఇక్కడ చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు తదితర వనరులు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ప్రత్యేక దేశం కోసం బలోచ్ ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారు.

## మూన్‌లైటింగ్ ఆరోపణలు.. అమెరికాలో భారతీయుడికి 15 ఏళ్ల జైలు శిక్ష!



భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి అనే వ్యక్తి అమెరికాలో అరెస్టయ్యాడు. మూన్‌లైటింగ్ చేయడమే అతడి అరెస్టుకు కారణం. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. అసలేం జరిగిందంటే.. న్యూయార్క్ వాసి అయిన గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్‌ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022 నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఇ మెయిల్‌ల ఆధారంగా గోస్వామి మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ పేర్కొన్నారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరుపరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు. అయితే, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఇందులో నేరం రుజువైతే అతడికి 15 ఏళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇక, గోస్వామి అరెస్టు నేపథ్యంలో మూన్‌లైటింగ్ గురించి మరోసారి చర్చ జరుగుతుంది.

## స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన



మైనారిటీల రక్షణ, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులను కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గట్టిగా స్పందించారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు. ఐరాస 80వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపు విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివాదాల యుగంలో శాంతి అవశ్యమని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఐక్యరాజ్య సమితిలో అంతా సరిగా లేదని అన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితిలో మార్పులు జరిగేలా సంస్కరణలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితికి భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని, అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. జాత్యాహంకారం, వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను స్విట్జర్లాండ్ ఎదుర్కొంటున్న సంగతిని ఆయన ప్రస్తావించారు.

శనివారం 25 అక్టోబర్ 2025
http://www.agnidharanews.com
అగ్నిధార

# నిద్రలోనే సజీవ దహనం

-మొదటిపేజీ తరువాయి

తర్వాత, వాటి ఆధారంగా మృతులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు బంధువులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. మరోవైపు, ఈ ప్రమాదంలో గాయపడిన వారి గురించి కూడా సూపరింటెండెంట్ వివరాలు తెలిపారు. మొత్తం 12 మందికి ఆసుపత్రిలో వైద్యం అందించగా, స్వల్ప గాయాలైన 8 మందికి ప్రథమ చికిత్స చేసి డిశ్చార్జి చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరిలో ఒకరికి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, మిగిలిన ముగ్గురి పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆయన వివరించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, గాయపడిన క్షతగాత్రులకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా, ప్రైవేట్ బస్సుల వేగ నియంత్రణ, భద్రతా చర్యలపై చర్చించేందుకు త్వరలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల రవాణా మంత్రులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రైవేట్ బస్సు బైక్ ఢీకొట్టింది. ఈ క్రమంలో మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ దారుణ ఘటనలో బైకర్ శివశంకర్‌తో సహా 20 మందికి పైగా ప్రయాణికులు సజీవ దహనమైనట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బస్సులో నుంచి దూకడంతో ప్రయాణికుల కాళ్లు, తలకు గాయాలయ్యాయి. ఘటన తర్వాత ఆస్పత్రికి వచ్చిన 11 మంది బాధితుల్లో ప్రస్తుతం నలుగురికి వైద్యం కొనసాగుతోంది. స్వల్ప గాయాలైన మరికొందరు ప్రాథమిక చికిత్స అనంతరం తమ స్వస్థలాలకు బయలుదేరారు.

**సీఎం - పీఎం దిగ్భ్రాంతి**

సీఎం రేవంత్ రెడ్డి ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ





అధికారులతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధితుల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. గద్వాల కలెక్టర్, ఎస్పీని ఘటనాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. ఈ ఘోర ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ప్రధాని సహాయ నిధి నుంచి పరిహారం ప్రకటించారు.

కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై తెలంగాణ సీఎం ఆరా

హైదరాబాద్: కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సీఎస్? రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెంటనే హెల్ప్? లైన్? ఏర్పాటు చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు జెన్?కో సీఎండీ హరీష్?ను వెంటనే ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు.

గద్వాల కలెక్టర్, ఎస్పీ అక్కడే అందుబాటులో ఉండాలని, బాధిత కుటుంబాలకు అండదండగా ఉండాలని సూచించారు. మృతుల గుర్తింపుతో పాటు క్షతగాత్రులకు అవసరమైన వైద్యసాయం అందించే చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రమాద ఘటనపై తెలంగాణ ప్రభుత్వం హెల్స్ లైన్ ఏర్పాటు చేసింది

ఎం.శ్రీరామచంద్ర- అసిస్టెంట్ సెక్రటరీ-991291954

ఈ.చిట్టిబాబు-సెక్షన్ ఆఫీసర్-9440854433

గద్వాల్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబర్-9502271122

కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్క్ నంబర్ 9100901599-9100901598

కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంట్రోల్ రూం నంబర్ 9100901604

గద్వాల్ పోలీస్ ఆఫీసు కంట్రోల్ రూమ్ నం. 8712661828

బాధిత కుటుంబాలు.. ఈ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు.

## కేసులు పెట్టి లోపలేస్తాం

-మొదటిపేజీ తరువాయి

వేధింపులని ట్రావెల్స్ యజమానులు ఆరోపిస్తున్నారని పొన్నం కీలక వ్యాఖ్యలు చేశారు. దాని వల్ల ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు వివరాలు లభించడం లేదని మండిపడ్డారు. ప్రమాదానికి గురైన బస్సు ఒడిషాలో రిజిస్ట్రేషన్ అయిందని పేర్కొన్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక రవాణా మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపడతామని మంత్రి పొన్నం ఉద్ఘాటించారు. కర్నూలు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బస్సు ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. బస్సుల్లో భద్రతా చర్యలపై నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. బస్సుల ఓవర్‌స్పీడ్ నియంత్రణకు కమిటీ వేస్తున్నట్లు పొన్నం ప్రకటించారు. ప్రైవేట్ ట్రావెల్స్ వ్యవస్థను నియంత్రించే ప్రయత్నం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## కాటేస్తున్న కల్తీ కల్లు

**నిజామాబాద్ :** కల్తీ కల్లు కాటేస్తుంది. కల్తీ కల్లు కు ప్రాణాలు హరి మంటున్నాయి. కామారెడ్డి జిల్లాలో పలు సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలం తాండూరు గ్రామంలో కల్తీ కల్లు కు బానిస గా మారి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కల్తీ కల్లు తాగుదామని వెళ్తే కాటికి పంపేశారు..కల్తీ కల్లు లో ఏమేం కలుపుతున్నారో తెలుసా..! కల్తీ కల్లు ప్రాణాలు తీస్తుందని తెలిసినా.. చాలా మంది దానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తక్కువ ధరకే దొరుకుతుండ టంతో కల్లు కాంపౌండ్లలోకి వెళ్లి ఆ కల్తీ కల్లు, రసాయనాలు కలిపిన కల్లు తాగి.. ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారు. కల్తీ కల్లు తాగి ప్రాణాలు కోల్పోతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.సహజంగా చెట్ల నుంచి వచ్చే కల్లులో రసాయనాలు, నీళ్లు, ఇతర పదార్థాలు కలిపి భారీ మొత్తం లో తయారు చేసి కల్లు కాంపౌండ్లలో విక్రయిస్తున్నారు. ఇలాంటి కల్లు తాగడం వల్ల అవయవాలు పనిచేయకుండా పోయి ప్రాణాంతకంగా మారుతోంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో కల్లు తాగడం చాలా మందికి ఒక అలవాటుగా ఉంటుంది. కేవలం మత్తు కోసమే కాకుండా.. కల్లులో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని చెబుతూ ఉంటారు.అందుకే ఊర్లలో కల్లు తాగడం అనేది పెద్ద సమస్యగా, వింతగా చూడరు. కానీ పట్టణ ప్రాంతాలకు వచ్చేసరికి స్వచ్ఛమైన కల్లు దొరకడం చాలా కష్టం. కల్లులో రసాయనాలు, ఇంకా వేరే వేరే పదార్థాలు కలిపి.. కల్తీ చేసి.. కల్లు కాంపౌండ్లలో విక్రయిస్తున్నారు. ఇదే ఇప్పుడు పట్టణ ప్రజల ప్రాణాలపైకి తీసుకువస్తోంది. కల్తీ కల్లు తాగి.. అస్వస్థతకు గురి కావడం, దానికి అలవాటై అనారోగ్యం పాలు కావడం, చివరికి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు కూడా చోటు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కల్తీ కల్లు తాగి చనిపోయిన సంఘటనలు వెలుగుచూసిన ప్రతీసారి.. అధికారులు హడావుడి చేసినా.. పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.కల్తీ కల్లులో కలిపే రసాయనాలు మనుషుల మరణానికి దారితీస్తాయి. లేదా దీర్ఘకాలికంగా శరీరంలోని అవయవాలను పూర్తిగా దెబ్బతీసి మృతికి కారణం అవుతున్నాయి. కల్తీ కల్లు తాగడం వల్ల మనుషులకు చాలా దుష్ప్రభావాలు ఉంటాయి. కొందరికి వెంటనే మరికొందరికి దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కల్తీ కళ్ళు సేవించి 19 ఏళ్ల యువకుడు మృతి తాజాగా కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి నియోజకవర్గ నాగిరెడ్డిపేట మండలంలో, జరుగుతున్న కల్తీ కళ్ళు విషయం వెలుగుచూసిన కల్తీ కల్లు ఘటన మరోసారి.. చర్చకు దారితీసింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలం తాండూరు గ్రామానికి చెందిన ధ్యాకమొల్ల,కుమార్ అనే 19 సంవత్సరాలు యువకుడు కూలి పని చేసుకుంటూ కల్తీ కల్లు సేవించడం వల్లే మృతుడి చావుకి కారణమని పరిసర ప్రాంతంలోని ప్రజలు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మద్యానికి బానిసై,కల్తీ కల్లు తాగి కుటుంబ సభ్యులను తరుచూ బాధపెట్టేవాడు.మృతిడికి,పెళ్లి కాలేదు.మృతుడికి అన్న నాగరాజు ,హైదారాబాద్ లో కూలి పనులు చేసుకుని జీవిస్తాడు.మృతుడి మరణం తో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నట్లు స్థానికులు తెలిపారు. కనీసం అధికారులు ఇకనైనా యువకులను మత్తుకు అలవాటు పడకుండా కల్తీ కల్లుకాటుకు మృత్యువాత పడకుండా కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.కల్తీ కల్లు విక్రయిస్తున్న దుకాణ యజమానులపై ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలను కాపాడవలసిన అధికారం ఆప్కారి శాఖకు ఉన్నదని, గ్రామాలలో చెట్లనుండి గీసిన కళు ్ళ కరువై చెత్త కంపెనీల నుండి కెమికల్ ద్వారా రసాయనాలు తీసుకొచ్చి మత్తుకు యువతను బానిసను చేస్తూ కాసులు జమ చేసుకుంటూ ప్రజల ప్రాణాల ఉసురు పోసుకుంటున్న,కల్తీ కల్లు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఎక్సైజ్ అధికారులను కోరుతున్నారు.

## రైతులకు కూలీ కష్టాలు

**అదిలాబాద్ :** పత్తిని ఏరేందుకు కూలీలు దొరక్క రైతులకు తిప్పలు తప్పడం లేదు. అనేక మంది కూలీలు వ్యవసాయ పనులకు దూ రం కావడం... ఇతర పనుల్లో నిమగ్నం కావడం వంటి సమస్య రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. చాలామంది ఎవరి పొలంలో వారే పనులు చేసుకోవడంతో పత్తి తీసేందుకు పల్లెల్లో కూలీలు దొరకని పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా కూలీల కోసం ఆదిలాబాద్ జిల్లా రైతులు పొరుగున ఉన్న మహారాష్ట్రకు పరుగులు పెడుతున్నారు. అక్కడి కూలీ ధర కంటే అధికంగా చెల్లిస్తామని చెపుతూ ఇక్కడకు తీసుకొస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో రవాణా చార్జీలు సైతం రైతులే భరిస్తున్నారు.ఈ ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10.66 లక్షల ఎకరాల్లో రైతులు పంట సాగు చేస్తున్నారు. తాజాగా పత్తి పగిలి ఏరేందుకు సిద్ధంగా ఉండటం.. స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన అనేక మంది రైతులు పొరుగు రాష్ట్రానికి పరుగులు తీస్తున్నారు. సరిహద్దు గ్రామాలతో పాటు కొంత కిన్వాట్, బొందిడి, మాం డ్వి, బోరి ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. కిలో పత్తి తీసేందుకు రూ.10 చెల్లించడంతో పాటు వారు స్థానికంగా కొన్ని రోజుల పాటు నివసించేందుకు నివాసాలు ఏర్పాటు చేయడం.. రేషన్ బియ్యం సైతం సమకూర్చడం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మరికొన్ని పల్లెలకు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి రోజువారీగా ఆటో చార్జీలు చెల్లిస్తూ కూలీలను తీసుకొస్తున్నారు. వీరితో పాటు ఆదిలాబాద్ వంటి పట్టణాల నుంచి సైతం వందల సం ఖ్యలో పత్తి తీసేందుకు పల్లెలకు వెళ్తున్నారు.

# విద్య రాని వ్యక్తి విద్యా శాఖ మంత్రి

-మొదటిపేజీ తరువాయి

భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హెూం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 95 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు.

అందులో 15400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. వెంటనే 2 లక్షల



ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

**ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు. అధికారంలోకి వచ్చాక వదిలేసారు.**

సీఎం రేవంత్.. దమ్ముంటే పోలీసులు లేకుండా అశోక్‌నగర్ రా.. హరీశ్‌రావు సవాల్

సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి రావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. బట్టలూడదీసి ఊడగొడుతారు అని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ఇచ్చిన మాట నిలుపుకో అని బాకీ కార్డులు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు. అధికారంలోకి వచ్చాక వదిలేసారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లతో అశోక్ నగర్, సరూర్ నగర్ స్టేడియంలో మీటింగులు పెట్టించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని మాయ మాటలు చెప్పారు. మోసం చేసారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు గానీ, రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిండు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది. కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లిహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# బోసన్ అడ్డంకులకు చెక్

**నిజామాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన ఎన్నికల హామీలలో కీలకమైనది వరిలో సన్నవడ్లకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ అందించే పథకం. అయితే ఈ పథకం అమలులో ఆలస్యం అవుతోంది. గత యాసంగిలో ధాన్యం కొనుగోలు చేసి ఆరు నెలలు గడుస్తున్నా.. సన్న ధాన్యం బోనస్ డబ్బులు నేటికీ పూర్తిగా చెల్లించలేదు.ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొద్ది మంది రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమ అయ్యాయి. సుమారు 90 శాతం రైతుల ఖాతాల్లో ఈ బోనస్ డబ్బులు ఇంకా జమ కాలేదు. దీనికి ప్రధాన కారణం సన్న వడ్లకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన కొన్ని ప్రమాణాల పాటించకపోవడమేనని తెలుస్తోంది. కాంగ్రెస్ హామీకి రైతుల్లో విశేష స్పందన లభించింది. అయినప్పటికీ.. బోనస్ సొమ్ము ఖాతాల్లో జమ కాకపోవడంపై రైతుల్లో అసంతృప్తి నెలకొంది. సన్న వడ్లు పండించినప్పటికీ.. నిర్దేశించిన ప్రమాణాలు పాటించకపోవడం వల్ల కొంతమంది రైతులకు బోనస్‌లు జమ కావడం లేదని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. రైతులు బోనస్ పొందాలంటే ధాన్యం నాణ్యత విషయంలో వ్యవసాయ శాఖ నిర్దేశించిన నియమాలను తప్పనిసరిగా పాటించాలి. వడ్ల గింజ పొడవు, వెడల్పుల నిష్పత్తి సరిగా ఉండాలి. గింజ పొడవు 6 మిల్లీమీటర్లు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా ఉండాలి. గ్రెయిన్ కాలిపర్ మెషీన్‌తో కొలిచినప్పుడు.. వడ్ల పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా ఉండే ధాన్యానికి మాత్రమే బోనస్ కోసం ప్రాధాన్యం ఇస్తారు.ఈ కొలతల నిబంధనలు సరిగా లేకపోతే.. ఆ ధాన్యాన్ని సన్నవడ్ల రకంగా గుర్తించడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. దీనివల్ల బోనస్ డబ్బులు రైతులకు చేరడం లేదు. సరైన సన్నవడ్ల దిగుబడి పొందాలంటే.. విత్తనాల ఎంపికలో రైతులు తప్పక జాగ్రత్త వహించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం.. తెలంగాణలో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లు మొదలైన సందర్భంగా.. రైతులు తమ పంట నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకుని.. బోనస్‌కు అర్హత పొందేలా ప్రయత్నించాలని ప్రభుత్వం సూచిస్తోంది

**అక్రమ మార్గాలు..**

మరో వైపు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ సన్నబియ్యం పక్కదారి



పడుతున్నట్టు సమాచారం అందుతోంది. నిత్యం నిరుపేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని దళారులు వెంకటియ తండా , గిరిపురం ,చిల్లంచర్ల, గ్రా మాల నుంచి అత్యధికంగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తున్నా, సంబంధిత అధికారులు ఈ విషయంపై దృష్టి సారించడం లేదన్న ఆ రోపణలు వినిపిస్తున్నాయి.తెలంగాణ అన్నపూర్ణగా విరాజిల్లుతున్నా, ప్రభుత్వం ఉచితం గా ఇస్తున్న ఈ బియ్యం కొందరి కక్కుర్తి కారణంగా లాభార్జనకు సాధనంగా మారుతోం ది. మరిపెడ మండలం నుండి సూర్యాపేట జిల్లా వంటి సరిహద్దు ప్రాంతాలకు ఈ బి య్యాన్ని రహస్యంగా తరలిస్తున్నట్లు సమాచారం. నల్లబజారులో సాగుతున్న ఈ వ్యాపారంలో, మార్కెట్లో కిలో రూ.50 నుంచి రూ.90 వరకు పలుకుతున్న సన్నబియ్యాన్ని దళారులు రేషన్ కార్డు లబ్ధిదారుల నుండి కేవలం రూ.10 నుండి రూ.15 ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. పేదల ఆకలిని పెట్టుబడి గా మార్చుకొని ఈ దందా గిరిపురం,అనేపురం, చిల్లంచర్ల కేంద్రంగా సాగుతోంది. సేకరించిన ఈ బియ్యాన్ని కాకరావయి ప్రాంతా నికి భారీఎత్తున చేరవేసి, అధిక ధరలకు అమ్ముకుంటూ లాభాలను ఆర్జిస్తున్నారు. దళారుల ముఠా చాకచక్యంగా ఈ అక్రమ రవాణాను నడుపుతున్నా, అధికారులు కేవ లం నామమాత్రపు చర్యలు తీసుకుని, చేతు లు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నా యి. నిబంధనలను బేఖాతరు చేస్తూ, పేదల సరుకును దోచుకుంటున్న ఈ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. అధికారు లు వెంటనే మేల్కొని ఈ సన్నబియ్యం దారి మళ్లింపును పూర్తిస్థాయిలో అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.సన్నబియాన్ని ప్రతి ఒక్కరు అమ్ముకుంటున్నారు. అలా అమ్ముకోకుండా తినటం వల్ల లబ్ధిదారులకు చాలా ఆరోగ్యంగా ఉంటుంది. దాంట్లో ఒక రకమైన బాల పోషకాలు కలిగిన మెడిసిన్ ఉం టుంది. కాబట్టి దాన్ని తినటం లబ్ధిదారులు ఆరోగ్యకరంగా

## సంపాదకీయం

# గురువు వెనుతిరుగుడంటే.. వ్యవస్థ పతనానికి సంకేతం!

ఒకప్పుడు విద్య అనేది ఆత్మీయత, విలువలు, గౌరవం అనే త్రివేణి స్రవంతిలా ప్రవహించింది. ఇప్పుడు అది గణాంకాలు, ఫలితాలు, రికార్డుల గజదొంగల వలలో చిక్కుకుంది. బోధనకు అంకితమై ఉన్న గురువు, క్రమంగా పరిపాలనా బంధనాల బానిసగా మారుతున్నాడు. ఇది వ్యక్తిగత వైఫల్యం కాదు.. విద్యా వ్యవస్థ పతనానికి సంకేతం. 'గురువు వెనుతిరుగుతుండు' అనే మాట మనకు ఒక హెచ్చరిక. దాన్ని వినగలిగితేనే మన భవిష్యత్తు నిలుస్తుంది. గురువుకు గౌరవం, స్వేచ్ఛ, భద్రత ఇవ్వగలిగితేనే విద్యార్థికి సృజనాత్మకత, జ్ఞానం, ఆనందం వస్తాయి. ఉపాధ్యాయుడికి బోధన వృత్తి పట్ల నిరాశ పెరగడం, విద్యార్థి–గురువు సంబంధం బలహీనపడడం దేశ భవిష్యత్తుకు ప్రమాదం. భారతదేశంలో గురువును 'ఆచార్య దేవోభవ' అని పూజిం చిన కాలం ఉంది. కానీ నేటి విద్యా వ్యవస్థలో గురువు ఒక అధి కార యంత్రంలో భాగంగా మారిపోయారు. ప్రైవేట్ పాఠశాలలలో 'ఫలితాలు' అన్న పదం గురువును గణాంకాల బందీగా మార్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో 'రికార్డు పనులు' గురువును బోధన నుంచి దూరం చేశాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు రోజంతా బోధనలో కంటే డేటా ఎంట్రీ, రిజిస్టర్ రాయడం, వివిధ పథకాల పర్యవేక్షణలో ఎక్కువ సమయం వెచ్చిస్తున్నాడు. పాఠశాలల్లో బోధనా స్వేచ్ఛ క్రమంగా తగ్గిపోతోంది. ప్రతి పాఠం 'మైక్రో ప్లాన్'లో బంధించబడింది. 'ఇంత సమయానికి ఇంత చదువు' అనే గణాంకం గురువుపై ఒత్తిడిగా మా రింది. ఒక మంచి సైన్స్ టీచర్ తన సృజనాత్మక పద్ధతులను వినియోగించాలంటే కూడా అనుమతి అవసరం అవుతోంది. పరీక్షల కేంద్రీకరణ, సిలబస్ భారం, మార్కుల ఆధారిత ఫలితాలు.. ఇవన్నీ బోధనను యాంత్రికంగా మార్చాయి. ప్రైవేట్ పాఠశాలలలో గురువులు 'రిపోర్టింగ్ యూనిట్స్ 'గా మారిపోయారు. విద్యార్థుల అభ్యాసం కంటే తల్లిదండ్రుల సంతృప్తి, ఫీజు వసూళ్లు, మార్కుల రేటింగ్‌లు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఒక ఉపాధ్యాయుడు ఒకే రోజులో ఐదు నుండి తొమ్మిది పీరియడ్స్ బోధించి, దాని తర్వాత 'పెర్ఫార్మెన్స్ రిపోర్ట్' సిద్ధం చేయాలి, తరువాత ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడాలి.. దీనికి విరామం లేదు. వారికి చెల్లించబడే వేతనం కూడా కనీస జీవన ప్రమాణాలకు సరిపోకపోవడం పరిస్థితిని మరింత దయనీయంగా చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక పాఠశాలలో ముగ్గురు గురువులు ఉంటే, విద్యార్థులు 150 మంది ఉంటారు. మరోవైపు ఏకోపాధ్యాయ పాఠశాలలు. వీటిలో తరగతుల బోధనతో పాటు మధ్యాహ్న భోజన పథకం, సర్కార్ ఆదేశాలు, వివిధ సర్వేలు, ఎన్నికల పనులు... ఇవన్నీ గురువుల భుజాలపై పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో బోధన నాణ్యతను కాపాడటం కష్టం. విద్యార్థులు ఆసక్తి కోల్పోతున్నారు, గురువులు ఉత్సాహం కోల్పోతున్నారు. అధిక పరిపాలనా ఒత్తిడి, తగిన గౌరవం లేకపోవడం, బోధన స్వేచ్ఛ కోల్పోవడం వంటి కారణాల వల్ల ఉపాధ్యాయులు మానసికంగా అలసిపోతున్నారని ఈ మధ్య పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు డిప్రెషన్, ఆందోళన, అసహనం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇది విద్యార్థుల అభ్యాస వాతావరణాన్ని కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. విద్య అంటే మార్కులు సంపాదించడం కాదు. మానవత్వం, విలువలను పెంపొందించటం. కానీ నేటి విధానం ఫలితాలను మాత్రమే కొలుస్తోంది. మనం విద్యను 'జీవితానికి తయారీ'గా చూడకుండా, 'పరీక్షకు తయారీ'గా మార్చేశాం. దీని ఫలితంగా సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచన, సమాజం పట్ల బాధ్యత అనే విలువలు తగ్గిపోతున్నాయి. గురువులకు స్వేచ్ఛ ఇవ్వాలి, బోధన పద్ధతులలో స్వతంత్రత ఉండాలి. ప్రతి గురువు తన సృజనాత్మకతను ప్రదర్శించగల వాతావరణం అవసరం. పరిపాలనా పనులు తగ్గించాలి, విద్యా శాఖ గురువులను రికార్డు పనుల బంధనాల నుంచి విముక్తం చేయాలి. ఒక ప్రత్యేక పరిపాలనా విభాగం ఈ పనులను నిర్వర్తించాలి. ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యానికి మద్దతు, సలహా కేంద్రాలు, శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి, గురువుల మానసిక శ్రేయస్సును కాపాడాలి. వేతనాలు, గౌరవం పెంచాలి, 'గురువు అంటే గౌరవం' అన్న భావనను తిరిగి తెచ్చుకోవాలి. సరైన వేతనం, స్థిర ఉద్యోగ భద్రత అవసరం. విద్యార్థి, గురువు సంబంధం పునరుద్ధరణ జరగాలి. సాంకేతికత మధ్యలో మానవ సంబంధం కనుమరుగవుతోంది. ఈ అనుబంధాన్ని తిరిగి బలపరచాలి. గురువు వెళ్తున్నారు అంటే అది కేవలం ఉద్యోగం వదిలి పెట్టడం కాదు.. ఒక విలువ వదిలి పెడుతున్నట్లు అర్థం. బోధన వృత్తి పట్ల నిరాశ పెరగడం, విద్యార్థి–గురువు సంబంధం బలహీనపడడం దేశ భవిష్యత్తుకు ప్రమాదం. అందుకే ఇప్పుడు అత్యవసరమైన పని.. విద్యను తిరిగి మానవతా విలువల దిశగా తిప్పడం. గురువుకు గౌరవం, స్వేచ్ఛ, భద్రత ఇవ్వగలిగితేనే విద్యార్థికి సృజనాత్మకత, జ్ఞానం, ఆనందం వస్తాయి. గురువు నిలబడితేనే దేశం ఎదుగుతుంది. 'గురువు వెనుతిరుగుతుండు' అనేది ఒక హెచ్చరిక. దాన్ని వినగలిగితేనే మన విద్యా వ్యవస్థ నిలబడగలదు.

# తెలంగాణకే తలమానికమైన ధర్మపురి నాటక సంస్థ




తెలంగాణలోనే మొదటిదిగా, తెలంగాణకే తలమానికంగా, ధర్మపురి పుణ్య క్షేత్రంలోని శ్రీలక్ష్మనరసింహ నాట్యమండలి గత 90 సంవత్సరాలుగా, కళామతల్లికి ఎనలేని సేవలందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సనాతన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు నిలయమైన ఈ క్షేత్రంలో, 1936లో ప్రారంభమైన నాటక సంస్థ 3 తరాల నటులతో పలు పౌరాణిక సాంఘిక చారిత్రక నాటకాలు–నాటికలు ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ప్రజాభిమానాన్ని చూర గొన్నది. గోదావరి తీరస్థ ప్రాచీన తీర్థము, పుణ్య క్షేత్రము అయిన ధర్మపురి పట్టణం, వేల సంవత్సరాల నుండి ఉజ్వల సాంస్కృతిక, వైదిక, నాగరికత, కలిగివున్న క్షేత్రంగా... ఆర్ష విద్యతో పాటు, సంగీతాది లలిత కళలకు నిలయంగా వాసికెక్కింది. తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం అంతగా లేక, స్తబ్దంగా ఉన్న రోజుల్లో, స్థానికుల సహకారంతో స్థాపించబడిన నాటక సంస్థ, తెలంగాణ లోనే మొదటిదిగా నిలువ కలిగింది. ఇది ప్రారంభం అయ్యే నాటికి తెలుగు భాషకు విలువ లేని "ఉర్దూ రాజభాష"గా గల నిజాం రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు... భారతీయ సంస్కృతికి, సాంప్రదాయాల కు, కళలకు విలువ ఇవ్వని కేంద్ర ఆంగ్ల ప్రభుత్వం మరో వైపు, అననుకూల వాతావరణం ఉండేది. అయినా స్థానికుల అభిమానం, ధనం, సేవాభావం, ఈ సంస్థకు ఊపిరి పోసాయి. కీర్తిశేషులు కాసర్ల వెంకట రాజయ్య శిక్షణలో, దర్శకత్వం లో, తొలి తరం నటులు "సతీ సావిత్రి" నాటక ప్రదర్శనతో ప్రారంభించి, అనంతర కాలంలో వెను తిరిగి చూడకుండా, సుమారు పాతిక పౌరాణిక నాటకాలు... ద్రౌపతి వస్త్రాపహరణం, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాభారం, లవకుశ, భక్త రామదాసు, సతీ సక్కుబాయి, సతీ తులసి, శ్రీకృష్ణ రాయబారం, పాండవోద్యోగం వంటి అనేక నాటకాలు ప్రదర్శించారు. ఆరోజుల్లో ఈ నటులు ప్రదర్శించని పౌరాణిక నాటకమే లేదంటే అతిశయోక్తి లేదేమో. కాకెరి లక్ష్మీ కాంత శాస్త్రి, రొట్టె చంద్రశేఖరశాస్త్రి, సంగనభట్ల మాణిక్య శాస్త్రి, తెలంగాణ త్యాగయ్య చాచం కృష్ణయ్య, జగన్నగారి విశ్వనాథశాస్త్రి లాంటి ఉద్దండులు, వారి సరసన దెమ్మ బాలకృష్ణయ్య స్త్రీ పాత్ర ధారిగా తొలి తరం నటులు బహు ప్రశంసా పాత్రులు అయినారు. నాటక సంస్థ రథసారథులలో ఒకరైన కే. వీ. కేశవులు ( రాష్ట్ర మాజీ మంత్రి), 1946 లో మంచిర్యాలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభలలో, శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శింప చేయగా, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులు నాటకాన్ని కాంచి, బహుధా ప్రశంసించారు. తర్వాత కాలంలో దేవులపల్లి రామానుజరావు, కాళోజీ నారాయణరావు, పివి నరసింహారావు, స్థానం నరసింహారావు లాంటి మేధావుల ప్రశంసా పాత్రమైంది. స్థానిక దైవం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో, ప్రత్యేక ఓపెన్ థియేటర్ లో ప్రదర్శిత నాటకాలకు జనం టిక్కెట్టు కొని మరీ చూసేవారు. ఆ రోజుల్లోనే సొంత నాటక ప్రదర్శన శాల ఉండేది. రకరకాల సీనరీ పరదాలు, మేకప్ సామగ్రి, గదలు, కిరీటాలు, ఉయ్యాలలు, నిచ్చెనలు, ఫైర్ వర్క్స్, వగయిరా సకల హంగులతో అట్టహాసంగా ఉండేది. మొదటి తెరపై భారతమాత చిత్రపటం కలిగి ఉన్న ఈ సంస్థ ఆ రోజుల్లో పెద్ద సాహసమే చేసింది. ఎందుకంటే ఇది రాజద్రోహం కిందకు వచ్చేది. ఫైర్ వర్క్స్ లో యముని రాక, నారదుని మబ్బుల్లో ప్రయాణం, శిశుపాలుని శిరచ్ఛేదం, ప్రహ్లాదుని అగ్నిగుండంలో వేయడం, ద్రౌపదికి కృష్ణుడు చీరలు అందించడం, వంటి ఎన్నో అద్భుతాలను కశో జ్జల శివరామయ్య పర్యవేక్షణలో చూపారు. రెండవ తరం నటులు దశాబ్దకాలం ప్రదర్శన ఇవ్వగా, నాటి సీనియర్ నాయకులు దాద గారి కిషన్ రావు నిర్వహణలో, సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలకు ప్రారంభ నిధుల సేకరణ గావించారు. గయోపాఖ్యానం నాటకం తెలంగాణ లోని చాలా ప్రాంతాల్లో రొట్టె విశ్వనాథశాస్త్రి, గుండయ్య శాస్త్రి, పెండ్యాల శంకర్, ఓజ్జల రామచంద్రం, నరసింహ చారి, గుండి హనుమాన్లు, భోగం పురుషోత్తం వంటి మేటి నటులతో ప్రదర్శించారు. మూడవ తరంలో పౌరాణిక నాటకాలతో పాటు వీరపాండ్య కట్ట బొమ్మన, వీర కాపయ, నాగమ నాయకుడు లాంటి చారిత్రక నాటకాలు పెక్కు సాంఘిక నాటకాలు ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. 1984 లో జిల్లా కలెక్టర్ కె ఎస్ శర్మ, 1991 లో కలెక్టర్ బన్వర్ లాల్ ఆహ్వానం మేరకు, వారి సమక్షంలో కరీంనగర్ కళాభారతిలో ప్రదర్శనలిచ్చి బహుమతులు అందుకున్నారు. 1989 లో తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించిన, సాంప్రదాయ పద్య నాటక పోటీలలో సూర్యాపేటలో "కట్టబొమ్మన" ప్రదర్శించారు. 2016లో వరంగల్ లో, వేణుమాధవ్ ఆడిటోరియంలో... అనంతరం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో.. ప్రదర్శన ఇవ్వడం జరిగింది. నిధులు ప్రోగు చేసి సొంత సామగ్రిని సమకూర్చు కున్నారు. ప్రస్తుత నటులలో కొందరు వీడియో, చలన చిత్రాలలో అవకాశాలు పొందారు. విద్యావేత్త విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నరసయ్య, బహుముఖ ప్రజ్ఞాశాలి, నటులు కొరిడె నరహరిశర్మ, కాకెర్ల దత్తాత్రేయ, ఎస్ రామకృష్ణయ్య, మునిగాల కిషన్ తదితరులు చారిత్రక నటులుగా మిగుల గుర్తింపు పొందారు 1993 లో తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ పేర్వారం జగన్నాథం ద్వారా నిధులు పొంది, స్వర్ణోత్సవాలు జరిపి, గయోపాఖ్యానం నాటకం ప్రదర్శించి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ దర్శకులు దివంగత బి. ఎస్. నారాయణ చేత కళాకారులకు సన్మానాలు చేయించారు. సావనీర్ విడుదల చేశారు. 1955 లో ఈ సంస్థ కళాకారులకు ఆంధ్ర నాటక పరిషత్తు 1983 లో ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ కాకర లక్ష్మీకాంత శాస్త్రికి, పెండ్యాల సీతారాములకు ఘనంగా సత్కారం చేశాయి. స్థానిక డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య నాటక రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా గ్రామీణ కళా జ్యోతి అవార్డు లభించింది. నలుగురు వృద్ధ కళాకారులకు గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ పథకాలను మంజూరు చేసింది. ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా కళామతల్లికి సేవ చేస్తూ సాంప్రదాయక పద్య నాటకాలను బ్రతికిస్తున్న అపురూప అరుదైన నాట్యమండలి 2017 ఏప్రిల్ 2,3 తేదీలలో నాటి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి, నాటి ప్రభుత్వ చీఫ్ విప్, గత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీ. ఎస్.రాములు తదితర ప్రముఖులు హాజరు కాగా, 80 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రస్తుతం నరహరి శర్మ ఆధ్వర్యంలో, నర్సయ్య పర్యవేక్షణలో, దత్తాత్రి నిర్వహణలో, రామకిష్టయ్య, చంద్రమౌళి, వెంకట రమణ, కిశోర్, మహేందర్, సురేశ్, బాలకృష్ణ, శేఖర్, నర్సింహమూర్తి, జన్మంచి నరసయ్య, వంశీ కృష్ణ, నరహరి, అమర్, అనిల్, శ్రీనివాస్, రాజ గోపాల్, రాంకిషన్ లకు తోడు కాకెరి అరుణ, సంగనభట్ల ప్రతిభ తదితరులు స్త్రీ పాత్రలను పోషిస్తూ, పౌరాణిక చారిత్రక నాటకాల ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. అయితే ఇటు వృద్ధ కళాకారులకు చేయూత, అటు నాటక ప్రదర్శన లకు తగిన ప్రత్సాహం అందించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వం పై ఉంది.

# సర్పపూజకు ఉద్దిష్టమైనది నాగుల చవితి



కార్తీక శుక్ల పక్ష చవితిని "నాగుల చవితి" అని పిలుస్తారు. ఇది సర్పపూజకు ఉద్దిష్టమైన దినం. కార్తీక శుద్ధ చవితి నాడు నాగవ్రతం చేయాలని చతుర్వర్గ చింతామణి చెపుతున్నది. శ్రీనాథుని శివరాత్రి మహాత్మ్యంలో ఇలా వర్ణింప బడినది. "చలి ప్రవేశించు నాగుల చవితి నాడు, మెరయు వేసవి రథసప్తమీ దివసమున, అచ్చ సీతు ప్రవేశించి బెచ్చు పెరిగి, మార్గశిర పౌష మాసాల మధ్యవేళ". పై గీతాన్ని బట్టి నాగుల చవితి కార్తీక మాసంలో వస్తుందని అర్థమవు తున్నది. నాగులు, గరుడులు, వానరులు, రాక్షసులు, అసురులు వీరంతా వేరువేరు జాతుల వారంటారు మానవ శాస్త్రజ్ఞులు. అస్సాం దక్షిణ భాగంలో ఉన్న నాగాయ్ కొండలలో ఇప్పటికీ నాగజాతి వారున్నారు. నాగులకు, ఆంధ్రులకు ప్రాచీన కాలమునుండి విశేష సంబంధముంది. భారతావనిలో అనేక ప్రదేశాలలో నాగజాతి వారున్నట్లు చరిత్ర చెపుతున్నది. కాశ్మీర రాజులు తాము కర్కోటక నాగ రాజు సంతతి వారమని చెప్పుకునే వారు. నాగపూరు రాజన్యులు తాము పుండరీక నాగరాజు సంతతికి చెందిన వారమని ప్రకటించు కునే వారు. ఆంధ్రులూ నాగజాతి వారనే వాదన కూడా లేకపోలేదు. బౌద్ధ ధర్మమంటే నాగులకు అనురక్తి ఉన్నట్లు, బుద్ధునికి పరమ భక్తులై నాగులు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారని బౌద్ధ వాఙ్మ యంలో అనేక గాథలు తెలుపు తున్నాయి. ఏలాపత్ర నాగుడు, ముచిలింద నాగుడు మొదలైన వారు బౌద్ధ గాథలలో ప్రసిద్ధులు. దిక్కులను పాలించే లోకపాలకులకు, నాగులకు సంబంధమున్నట్లు బౌద్ధుల విశ్వాసం. అమరావతి, నాగార్జున కొండతో పాటు అవిభక్త కరీంనగర్ జిల్లాలోని ప్రాచీనమైన ధూళికట్ట తదితర ప్రాంతాలలో బౌద్ధ శిల్పాలలో నాగరాజుల, నాగి మల చిత్రాలున్నాయి. ప్రాచీనాంధ్రులు నాగులను కటి ప్రదేశం నుండి పైభాగమంతా మనిషి రూపంలో, క్రింది భాగమంతా సర్ప రూపాలలో చెక్కారు. నాగరాజు చిత్రాలకు తలపైన ఐదు పడగలుంటాయి. నాగినికి ఒక్కటే పడగ. భారతావనిలో నాగపూజ ఆదినుండీ ఆచరణలో ఉంది. గౌతముడు తన గృహ్య సూత్రాలలో పేర్కొనగా యజ్ఞ మంత్రాలలో నాగుల స్తుతి పేర్కొనబడింది. నాగశిలలు, నాగ కల్లులూ, ప్రతిమలు ప్రతి చోట దర్శన మిస్తాయి. పుట్టిన బిడ్డలు చనిపోతుంటే సంతానం నిలవడానికి నాగ ప్రతిష్ఠలు చేయడం ఆరాధిం చడం ఆచారంగా ఉంది. పాములు భూమి అంతర్భాగమందు నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి " నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనంచేసే క్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా "రైతు" కు పంటనష్టం కలగకుండా చేస్తాయి. అలా ప్రకృతి పరంగా అవి మనకు ఎంతో సహాయ పడుతూ ఉంటాయి. ఆదినుండీ ఆంధ్రులు, నాగారాధకులుగా ఉన్నారు. "నన్నేలు నాగన్న నాకులమునేలు, నాకన్న వారల, నాయింటి వారల, అప్తుల మిత్రుల, నందరను నేలు, పడగ దొక్కిన, పగ వాడనుకోకూ, నడుము దొక్కిన నావాడను కొనుమూ తోక తొక్కిన తొలగుచు పొమ్ము, ఇదిగో! నూక నిచ్చెదను మూకను నాకిమ్ము, పిల్లల మూకను నాకిమ్ము" అని నాగేశ్వరుని ప్రార్థించడం అనవాయితీగా ఉంది. ఐదు తలల పాములను వెండితో గాని, మట్టి తోనైనా చేసి పూజించడం ఆచారం. చెవిలో చీము పట్టినా, వినపడక పోయినా, చెవులను బంగారు, వెండితో చేయించి శివాలయాలకు సమర్పించడం పరిపాటిగా ఉంది. అనంత, వాసుకి, శేష, పద్మనాభ కంబల, కర్కోటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళి అని 12రకాల సర్పాలను ఒక్కొక్క నెలలో పూజించడం ప్రాచీన సాంప్రదాయంగా ఉండేది. ప్రపంచంలో శాస్త్రవేత్తలకు తెలిసిన దాదాపు అన్ని రకాల పాములున్న దేశం భారత దేశమే. మానవుని మానసిక శక్తికి హిందూదేశంలో పాము చిహ్నంగా ఉంది. మానసిక శక్తికి వేదాంత పరిభాషలో కుండలినీ శక్తి అని పేరు. నిస్సంగుల తపస్సు అంతా ఈ కుండలినీ శక్తిని లేపుటకే. కుండలినీ శక్తిని గ్రీకు భాషలో "స్పీరిమా" అంటారు. స్పీరిమా అంటే సర్ప వలయం. కుండలినిని సర్పంటైన్ గా పిలుస్తారు. శరీరమనే పుట్టకు తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటారు. మానవ శరీరంలో నాడులతో నిండివున్న వెన్నెముకను ' వెన్నుబాము' అని అంటారు. మూలాధారం నుండి సహస్రారము వరకు వెన్నెముక మధ్యనుండి సర్పాకారముగ కుండలినీ శక్తి అనబడు సుషుమ్నా నాడిని లేవ జూపడమే నాగపూజ ప్రధాన ఉద్దేశమని విజ్ఞుల భావన. కుండలినీ శక్తి మూలాధార చక్రంలో "పాము" ఆకారమువలెనే వుంటుందని "యోగశాస్త్రం" చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ... కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని గ్రక్కుతూ, మానవునిలో ' సత్వగుణ' సంపత్తిని హరించి వేస్తూ ఉంటుందని అందుకు నాగుల చవితి రోజున ప్రత్యక్షంగా విష సర్పపుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది, అందరి హృదయాలలో నివసించే ' శ్రీమహావిష్ణువు నకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసే సత్కర్మనే నాగుపాము పుట్టలో పాలు పోయుటలోగల అంతర్యమని భావన.

# బదిలీ పై వెళ్తున్న అధికారికి సన్మానం

**అగ్నిధార గోదావరిఖని టౌన్ అక్టోబర్: 24** ఇటీవల సింగరేణి ఐఈడి ఆఫీసర్ల బదిలిలలో, ఎస్టిపిపి నుండి ఇల్లందు ఏరియాకు బదిలీపై వెళ్తున్న డిజిఎం (ఐఈడి) ఎం. ప్రభాకర రావు ఎస్టిపిపి అధికారులు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలకడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్టిపిపి ఈడి శ్రీ సిహెచ్ చిరంజీవి ఎస్టిపిపి జిఎం ఎం. నరసింహ రావు ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రభాకర రావుతో కలసి పనిచేసిన అనుభవాలను పంచుకోవడం జరిగింది. ప్రభాకర రావు ఎస్టిపిపిలో సుదీర్ఘ కాలం తన సేవలను అందిచారన్నారు. ఎస్టిపిపి ఈడి శ్రీ సిహెచ్. చిరంజీవి మాట్లాడుతూ ప్రభాకర రావు తన విధినిర్వహణలో అంకితభావంతో పనిచేశారు అని, వారు ఏ పనినైనా నిబద్ధతతో చేసేవారని తెలిపారు. అధికారులకి బదిలీ అనేది సహజం అని, ఎక్కడికి వెళ్ళినా సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ సందర్భంగా జిఎం ఎస్ టీ పి పి ఎం. నరసింహ రావు మాట్లాడుతూ ప్రభాకర్ రావు ఎస్టిపిపిలో దాదాపు 14 సంవత్సరాలు పనిచేసారని, ప్లాంటు నిర్మాణ దశ నుండి ప్లాంటు పూర్తయ్యే వరకు అనేక రకాలుగా తన సేవలు అందిచారన్నారు, అలాగే ప్లాంటు ఉద్యోగులతో సౌమ్యంగా ఉంటూ అధికారులతో స్నేహ పూర్వక సంబంధాలు కొనసాగించారని తెలియజేసారు. అనంతరం ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఎస్టిపిపి లో ఇంత కాలం పనిచేయడం చాలా



సంతోషంగా ఉంది అన్నారు విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈడి ఎస్టిపిపి సిహెచ్ చిరంజీవి జిఎం ఎస్టిపిపి ఎం నరసింహారావు ఏజీఎం(పిసిఎస్) చీఫ్(ఓ ఎం) మదన్మోహన్ ఏఐటియుసి పిట్ సెక్రటరీ సిహెచ్ సత్యనారాయణ సిఎంఓఎఐ బ్రాంచ్ సెక్రెటరీ సంతోష్ కుమార్ ఏజీఎం(సోలార్) ఎస్ శ్రీనివాస్ డిజిఎం (సివిల్) ఆజాజుల్లా ఖాన్ డిజీఎం (1800) వేణుగోపాల్ డీజీఎం(పర్సనల్) డి కిరణ్ బాబు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా అందె నియామకం.



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** హైదరాబాదులోని జాగృతి కార్యాలయంలో తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా గోదావరిఖనికి చెందిన జాగృతి సీనియర్ నాయకులైన అందె సదానందంని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించారు. సదానందం గత 13 సంవత్సరాలుగా జాగృతి కి అందిస్తున్న సేవలను గుర్తించి నియమించడంజరిగిందని, చాలాసంవత్సరాలు రామగుండం నియోజకవర్గం కన్వీనర్ గా, పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఈ సందర్భముగా అందె సదానందం మాట్లాడుతూ... నాపై నమ్మకంతో సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిన కవితక్కకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కవిత మార్గదర్శకత్వంలో పనిచేస్తానని, జాగృతి నియమ నిబంధన కట్టుబడి పని చేస్తానని అందే తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో మృతులకు ప్రగాఢ సానుభూతి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్ బస్సు కర్నూలు సమీపంలోకి చేరుకోగానే యాక్సిడెంట్ లో భాగంగా ప్రమాదానికి గురి అయ్యి బస్సులో ఉన్న 45 మంది ప్రయాణికుల్లో దాదాపు 25 మంది అగ్నికి ఆవుంతి కావడం చాలా బాధ కలిగించిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులందరూ కూడా మంచి నిద్రలో ఉన్నారు నిద్రలోనే మరణం వైపు వెళ్లడం అంటే చాలా విషాదకరమైన పరిస్థితి అని చిన్న పిల్లలు కూడా మరణించడం బస్సు యజమాన్యం పూర్తి బాధ్యత వహించాల్సిన అవసరం ఉంటుందని ఆయన అన్నారు అధునాతన పరికరాలు అందుబాటులో ఉండె సమయంలో ఘటనలు అని ఆయన ఈతవు పలికారు ట్రావెల్ బస్సులలో కూడా కూలింగ్ గ్లాస్ సిలిండర్లు ఫిట్ చేసి అలాంటి గ్యాస్ సిలిండర్ ద్వారా ఇలాంటి ప్రమాదాలు జరిగిన వెంబడి గ్యాస్ విడుదలై ప్రమాదాన్ని నివారించే పరిస్థితులు ఉంటాయని అలాంటి వాటిని బస్సులో అమర్చకపోవడం వల్లనే ఇలాంటి ప్రాణ నష్టం జరిగి ఉన్నదని తెలిపారురాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ బస్సు యజమాన్యంపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలకు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు 25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కూరగాయల మార్కెట్ హమాలీ కూలీల రేట్లు పెంచాలి

- స్పందించక పోతే నవంబర్ 12 తర్వాత సమ్మె కు పిలుపు నిస్తాం.
- ఏఐటీయుసి హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఎ.గౌస్ హెచ్చరిక.

**అగ్నిధార గోదావరిఖని టౌన్ అక్టోబర్: 24** గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచుకుంటే నవంబర్ 12 తర్వాత సమ్మె కు పిలుపు నిస్తామని ఏఐటీయుసి హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఎ గౌస్ హెచ్చరించారు. శుక్రవారం గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో జరిగిన హమాలీ కార్మికుల సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మార్కెట్లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు పాత కూలీ రేట్లు చెల్లిస్తున్నారనీ, కొత్త గా కూలీ రేట్లు పెంచాలని గత మూడు సంవత్సరాల నుండి వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ కు విన్నవించినప్పటికినీ పట్టించుకోవడం లేదని, దీని పై కరీంనగర్ లోని జిల్లా లేబర్ అధికారికి ఫిర్యాదు చేయడం జరిగిందని దీని పై బుధవారం ఆయన కార్యాలయం లో చర్చించగా నవంబర్ 12 న సమస్యా పరిష్కారం కోసం మాట్లాడుకోవాలని ఆయన సూచించారని, నవంబర్ 12 న వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ కూలీ రేట్లు పెంచే విధంగా



లేబర్ కమిషనర్ వద్ద కు రావాలని, లేకుంటే నవంబర్ 12 తర్వాత సమ్మె కు పిలుపు నిస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గాలిపెల్లి సతీష్, రాంచందర్ జానీమియ బండారి రవి తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట్ లో శివారులో అనుమతి లేని బోరు సీజ్



**అగ్నిధార న్యూస్ మంథని :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని బేగంపేట్ శివారులో అనుమతి లేని వ్యవసాయ బోరు మోటర్ ను శుక్రవారం రామగిరి తాసిల్దార్ సుమన్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహేష్ సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలోని ఆదివార పేటకు చెందిన ఏలువాక శంకరయ్య అనుమతి లేకుండా వ్యవసాయ బోరు వేసి మోటార్ బిగించడంతో బాధితుడు వెంకటేష్ చేసిన ఫిర్యాదు మేరకు జల భూగర్భ, రెవెన్యూ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఇరు శాఖల అధికారులు సంయుక్త విచారణలో అనుమతి లేకుండా బోరు వేశారని తేలడంతో అట్టి వ్యవసాయ బోరును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. బోర్ మోటార్ సీజ్ నిబంధనల ను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

# అరుణ్ కుమార్ కు అంగన్వాడీ టీచర్ల సన్మానం

**అగ్నిధార న్యూస్ మంథని :** టి జి పి ఎస్ సి ద్వారా గ్రూప్ 1 సర్వీస్ కు ఎంపికై అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంట్ గా నియామకం అయిన జక్కుల అరుణ్ కుమార్ గ్రూప్ 2 లో కూడా డిప్యూటీ తహసిల్దారిగా ఎంపిక అయినారు. జేఈఈ మెయిన్స్ ద్వారా జబల్పూర్ లో బీటెక్ (ఈసీఈ) పూర్తిచేసి. 3 సంవత్సరాలు సివిల్స్ కు ప్రిపేర్ అయి 3 సార్లు సివిల్స్ రాశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2022లో ఇచ్చిన గ్రూప్స్ నోటిఫికేషన్ తో గ్రూప్స్ కు సన్నద్ధమై గ్రూప్ 1, 2, 3 లలో ఉత్తమ ర్యాంకులు సాధించడం జరిగింది. అరుణ్ కుమార్ తండ్రి లక్ష్మీనారాయణ కమాన్ పూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లి మల్లీశ్వరి అంగన్వాడీ టీచర్, చెల్లెలు సాయి ప్రసన్న సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వెంకటాపూర్ సెక్టర్ అంగన్వాడి టీచర్లు వారి తోటి అంగన్వాడి టీచర్ కుమారుడు గ్రూప్ 1 ఉద్యోగం సాధించినందుకు సంతోషిస్తూ అరుణ్ కుమార్ ను శాలువాతో సన్మానిం చారు. అనంతరం



అరుణ్ కుమార్ తనను సన్మానించిన టీచర్లందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు హరిత, సంధ్య, రాజేశ్వరి, సత్తక్క, కనకలక్ష్మి, చంద్రకళ, లక్ష్మి, సృజన, మంగ, రాదాబాయి, సునీత, లలిత, రాజక్క, శ్యామల, స్వరూప, అనసూర్యలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మొదటి స్థానం సాధించిన సి.చందన

రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి కబడ్డీ టీంకు ఎంపికైన సి.చందన

పరిగి ఎమ్మెల్యే టి.రామోహన్‌రెడ్డి సన్మానం



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:** మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని సి. చందన అండర్ 14 విభాగంలో ప్రతిభ చూపి జాతీయస్థాయి కబడ్డీ టీంకు ఎంపికైంది. హైదరాబాద్‌లోని పటాన్‌చెరువులో ఇటీవల నిర్వహించిన 69వ ఎస్.జి.ఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 కబడ్డీ పోటీల్లో చందన తెలంగాణ రాష్ట్రం తరఫున మొదటి స్థానం సాధించి ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామోహన్‌రెడ్డి విద్యార్థిని చందనను పాఠశాల పిడి అబ్దుల్ బిన్ అహ్మద్ ను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో చందన అద్భుత ప్రదర్శన చూపి ఇండియా టీమ్‌లో స్థానం సంపాదించడం గర్వకారణమని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నదని, విద్యా ఉద్యోగాల్లో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సురేందర్‌రెడ్డి పాఠశాలకు అవసరమైన సౌకర్యాల గురించి ఎమ్మెల్యే గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం. నారాయణ, ఉమ్మడి గండీడ్ మండల పి.ఎ.సి ఎస్ మాజీ చైర్మన్ కమతం విష్ణువర్ధన్‌రెడ్డి, మండల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డి. విష్ణు, మాజీ ఆప్షన్ నెంబర్ ఈసా బస్రావి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సురేందర్‌రెడ్డి, పి.డి. అబ్దుల్ బిన్ అహ్మద్, మాజీ సివియర్ వార్డ్ మెంబర్ జే వీరాజీ, సి. హనుమంతు, జి. లక్ష్మి కాంత్ రెడ్డి, బి సత్యయ్య, ఎస్ కేశవులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల చారి ట్రబుల్ ద్వారా మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం లోని తిమ్మినోని పల్లి గ్రామానికి చెందిన పోడేండ్ల అనూష అనారోగ్య సమస్యతో బాధపడుతూ చనిపోవడం జరిగింది స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మిషన్ భగీరథ రాష్ట మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3000 వేల రూపాయలు అందజేశారు. మరియు మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య 2000వేల రూపాయలు టిఆర్ఎస్ యువ నాయకులు గండికోట రాజు 2000 వేల రూపాయలు మొత్తం 7000 వేల రూపాయలు మృతురాలి కుటుంబానికి అందజేయడం జరిగింది. కార్యక్రమంలో, మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, యువ నాయకుడు గండికోట రాజు, బిఆర్ఎస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్ లో సత్తా చాటిన ఐపీఎస్ విద్యార్థులు




**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్, అక్టోబర్ 24** ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి 14,17 సంవత్సరాల బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలలో సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు 14 సంవత్సరాల బాలబాలికల విభాగంలో ఈ వర్షిత గోల్డ్ మెడల్, అభిజ్ఞ శ్రీ బ్రాంజ్ మెడల్, ఏం సంప్రీత్ బ్రాంజ్ మెడల్ సాధించగా, 17 సంవత్సరాల బాలబాలికల విభాగంలో జి సుశాంత్ గోల్డ్ మెడల్, సిహెచ్ ఖుషి సిల్వర్ మెడల్, బి మణికంఠ బ్రాంజ్ మెడల్, ఎండీ అస్రఫ్ బ్రాంజ్ మెడల్ సాధించి సత్తా చాటారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ ఆడటం వల్ల విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని, వేగంగా కదిలే బంతికి ప్రతి స్పందించడం వల్ల నిర్ణయం తీసుకునే సామర్థ్యం మెరుగుపడుతుంది. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, శివ సతీష్ మమత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిధార

# శ్రీ తుల్జా భవానీ మాత అను గ్రహంతండా ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలి





**దేవాలయ అభివృద్ధికి 3,00,000 లక్షలతో సహకారం**
**విగ్రహా ప్రతిష్టాపనలో పాల్గొన్న సింగిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కడ్తాల్ మండలం కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీ తుల్జాభవానీ మాతా దేవాలయంలో అమ్మవారి విగ్రహా ప్రతిష్టాపన మహెూత్సవ కార్యక్రమానికి హాజరైన.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు మనలో ఆధ్యాత్మికతను పెంపొందించి, శాంతిని అందించే గొప్ప నిలయాలు అని ఆలయాల అభివృద్ధికి అందరం సహకారం అందించాలని,మన సంస్కృతి సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్తూ, భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందని తెలుపుతూ కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న తుల్జాభవాని మాతా దేవాలయ అభివృద్ధికి తండా వాసుల,స్థానిక నాయకుల కోరిక మేరకు ఆలయ నిర్మాణానికి రూ.3,00,000 మూడు లక్షలతో సహకారం అందించడం జరిగిందని, మొదటి విడతగా ఆలయ నిర్మాణానికి 1,00,000 ఒక లక్ష చెక్ రూపకంగా అందించడం తో పాటు రెండో విడతగా ఆలయానికి రూ.2,00,000 రెండు లక్షల రూపాయల తో పెయింటింగ్ పనులు పూర్తి చేయడం జరిగిందని,ఆలయ అభివృద్ధిలో తనను భాగస్వామ్యం చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ దేవాలయ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.మా తండా లో తుల్జా భవానీ మాత దేవాలయ నిర్మాణానికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి అడిగిన వెంటనే స్పందించి ఆలయ అభివృద్ధికి రూ.3,00,000 లతో సహకారం అందించారని, ఇంత త్వరగా పెద్ద మొత్తంలో తోడ్పాటును అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ఎల్లపుడు రుణపడి ఉంటామని వారికి భవిష్యత్ లో కూడా తోడుగా నడుస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భిక్య నాయక్,మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, ఆలయ కమిటీ సభ్యులు బిచ్య నాయక్, నర్సింగ్, లక్ష్మణ్,నరేష్,జన్య,రాజు, దేవుల మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ప్రశంసించిన మాజీ గవర్నర్ జూలూరి రమేష్ బాబు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ ను అవార్డుతో సత్కరించారు. క్లబ్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి తో పాటు జూలూరి రమేష్ బాబు ఆయనను అభినందించడం తోపాటు లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డు అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్లు చెన్నకిషన్ రెడ్డి, జూలూరు రమేష్ బాబు, జూలూరు రఘు, జనార్దన్ రెడ్డి, లింగయ్య, రామకృష్ణ, శ్రీధర్, గోపాల్, శ్రీనివాసరెడ్డి, శివా జగదీశ్వర్, జూలూరు సత్యం తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయం

– పరిగిఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ /గండిడ్ :** బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారి అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు.శుక్రవారం గండీడ్ మండల కేంద్రంలో 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ,ముబారక్ చెక్కులను అందజేశారు.అనంతరం జంగం రెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రెడ్డిపల్లి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం కోసం భూమి పూజ, వెన్నచేడ్ మోడల్ స్కూల్లో ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వారి సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందుతుందని అన్నారు. సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు,రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలతో పేదలు లబ్ధి పొందుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నరసింహారావు,గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ,హౌసింగ్ డి ఈ పుష్పలత, సూపరిండెంట్ హరిచంద్ర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆశన్న, బిసి సెల్ అధ్యక్షులు శంకరయ్య,వెంకన్న గౌడ్, పులిందర్ రెడ్డి, కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఐమావతి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోస్గి మొగులయ్య,వెంకటేష్, నర్సింలు, శ్రీనివాస్ తిరుపతిరెడ్డి, హనుమంతు పాలమూరు ఆంజనేయులు కృష్ణయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల కేంద్రానికి చెందిన సింగరాజు వెంకటయ్య అనారోగ్యతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటానని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో, తిరుపతి రెడ్డి, రేవెల్లి దర్గయ్య మారేపల్లి శ్రీను గుద్దటి కిష్టాలు, రేవెల్లి రాజు, సురేష్, దాసరి మహేష్, గంగపు అంజి, శివ, భరత్, సమీర్, గంగాపురం శేఖర్.

## ఆటోను ఢీ కొట్టిన డీసీఎం వ్యాను




**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండిడ్:** ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో మహిళకు గాయాలైన ఘటన మహమ్మదాబాద్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోస్గి నుంచి మహబూబ్నగర్ వైపు వెళుతున్న డీసీఎం వ్యాను అతివేగంగా వచ్చి దేశాయిపల్లి గేట్ దగ్గర బస్టాండ్ లోకి వెళుతున్న బస్సును, పక్కనే ఉన్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న అంజమ్మ అనే మహిళకు గాయాలైనాయి, బస్సు ముందు భాగం కొంత డ్యామేజ్ అయింది. గాయపడిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## పెళ్లి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన నాగులపల్లి మురళి మోహన్ రావు కుమారుడు సాయి అనురాగ్ వివాహం హైదరాబాద్ స్వాగత్ గ్రాండ్ కన్వెన్షన్ , వివాహ వేడుకలలో వెల్జాల్ మరియు పరిసర గ్రామల కాంగ్రెస్ నాయకులు పాల్గొని నూతన దంపతులకు అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస మూర్తి, అంబాజీ, నాయకులు అంజయ్య గౌడ్, వెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి గోపాల్ రెడ్డి నరేందర్ గౌడ్, అశోక్ బాబు, అజీజ్, శ్రీనివాసులు, నర్సింలు,విజయ్ కుమార్, సిహెచ్ విష్ణువర్ధన్ యాదవ్, గులాం హుస్సేన్, మోహన్ దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీని నిర్వహించడం జరిగినది రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్స్, కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి,ఎస్ఐ రమేష్ పర్యవేక్షణలో రాజ్యలక్ష్మి ఫంక్షన్ హల్ లో (డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు)అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొత్తం 91 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులలో అవగాహన, సృజనాత్మకత, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని, విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామని సీఐ తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్తి కి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** హైదరాబాద్ లోనీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమనగల్లు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు మండ్లి రాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుర్రం కేశవులు, కాలే మల్లయ్య, పాల్గొనడం జరిగింది

## బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని

మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని మాత అని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండాలో నూతనంగా నిర్మించిన తుల్జా భవాని ఆలయంలో తుల్జామాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో వేద పారాయణం, మండప పూజ, ప్రధాన హెూమాలు నిర్వహించారు. మంగళ నీరాజనాలతో గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో. బోజ్య మహారాజ్, మాజీ సర్పంచులు భిక్య నాయక్ హరిచంద్ నాయక్, రాములు నాయక్, డైరెక్టర్ సేవ్య నాయక్, ఉపసర్పంచ్ పాండు నాయక్, శంకర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్ శీను నాయక్, టిక్ లాల్ నాయక్, నరేష్ నాయక్, జాన్యా నాయక్, రూప్ సింగ్ నాయక్, శీను నాయక్, అంజి, రాజు, రవి, రెడ్యా, బిచ్యా, హరియా జగన్, చందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**అగ్నిధారన్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి మినీ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్టపై గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమానికి వచ్చిన ఆయనకు మత్స్యకారులు ఘనంగా స్వాగతం పలికారు వనపర్తి నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం త్వరలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు కార్యక్రమంలో వనపర్తి పట్టణ మత్స్య సహకార సంఘ సభ్యులు, మత్స్యకారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకున్న ఆలస్యం ఎందుకు

**నిర్మాణాలను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండల పరిధిలోని చందాపూర్, చిట్యాల గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు మంజూరి పత్రాలు అందుకుని ఇంకా ప్రారంభించని వారు త్వరగా ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. గ్రౌండింగ్ ప్రారంభించిన ఇళ్లు బెస్మెంట్ లెవల్‌కు చేరితే మొదటి విడత చెల్లింపులు జరుగుతుందని అన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. పెండింగ్ లేకుండా లబ్ధిదారులకు నగదు పడే విధంగా చూసుకోవాలని, పెండింగ్ సమస్యలు ఏమైనా ఉంటే నివేదిక సమర్పించాలని కలెక్టర్స్ సూచించారు నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు ఇసుకకు సంబంధించి



ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గణితం పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి చందాపూర్ గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థుల గణితం మార్కుల నివేదికతో పాటు ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ గురించి ఆరా తీశారు. గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, గృహ నిర్మాణ శాఖ డి ఈ విఠోబా, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ప్రధాన న్యాయమూర్తిపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జననేత పెర్క శ్యామ్ :** చీఫ్ జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి విషయమై టి పి సి సి నాయకులు జననేత పెర్క శ్యామ్ వైట్ హౌస్ లో ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ఇటువంటి చర్యలను తక్షణమే అరికట్టాలని ముక్త కంఠం తో ఖండించారు. జననేత పెర్క శ్యామ్ మాట్లాడుతూ,"భారత రాజ్యాంగ రక్షకులైన న్యాయమూర్తులపై దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు. రాజ్యాంగ విలువలను కాపాడటానికి ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఇంజం వెంకటస్వామి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి విహెచ్పిఎస్ ప్రజా సంఘాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తాం





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఐ డి ఓ సి సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అధ్యక్షతన, బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు మండల పంచాయతీ అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో టాక్స్ కలెక్షన్, సానిటేషన్, విజిబుల్ క్లీన్లినెస్, పబ్లిక్ ఇన్స్టిట్యూషన్స్ క్లీనింగ్, సేగ్రిగేషణ్ షెడ్ నిర్వహణ, ఫాగింగ్, సిటిజెన్ సర్వీసెస్, ట్రేడ్ లైసెన్సుల క్లియరెన్స్, డ్రింకింగ్ వాటర్ ఇష్యూస్, క్లోరినేషన్, రికార్డుల నవీకరణ, డి ఎస్ ఆర్ ఏపీపి వినియోగం పి ఎం ఏ వై జి అంశాలపై చర్చించబడింది. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ, అధికారులు గ్రామస్థాయిలో శుభ్రత, వంద శాతం పన్నుల వసూళ్లు ప్రజా సేవల అందజేతలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎజెండా అంశాల అమలులో నిర్లక్ష్యం జరిగినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారులు పెద్దపల్లి మంథని, ఈఈ హౌసింగ్ ఈఈ మిషన్ భగీరథ పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష ఫీజు తేదీలు వచ్చేశాయ్.. ఆ రోజే లాస్ట్ డేట్..

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని /పెద్దపల్లి** జిల్లా తెలంగాణలో 2026 మార్చిలో జరగనున్న 10వ తరగతి (ఎస్ ఎస్ సి) పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువులను తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ప్రకటించింది. రెగ్యులర్ విద్యార్థులతో పాటు, గతంలో ఫెయిల్ అయిన వారందరికీ ఈ గడువులు వర్తిస్తాయని డీజీఈ స్పష్టం చేసింది. లేట్ ఫీజు లేకుండా విద్యార్థులు ఫీజుచెల్లించవచ్చు అక్టోబర్ 30, 2025 నుండి నవంబర్ 13, 2025 వరకు. పాఠశాల హెడ్ మాస్టర్లు విద్యార్థుల నుంచి సేకరించిన మొత్తాన్ని నవంబర్ 14లోపు ట్రెజరీకి సమర్పించాలి. ఇక ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు హెచ్‌ఎంలకు నవంబర్ 18 వరకు గడువు ఇవ్వబడింది. అని లేట్ ఫీజు గడువులురూ. 50 లేట్ ఫీజుతో నవంబర్ 15 – నవంబర్ 25,రూ. 200 లేట్ ఫీజుతో: నవంబర్ 29 – డిసెంబర్ 12రూ. 500 లేట్ ఫీజుతో: డిసెంబర్ 15–డిసెంబర్ 29,డీజీఈ కార్యాలయం ఈ గడువుల ను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించబోమని స్పష్టం చేసింది. ఫీజు వివరాలు:అన్ని సబ్జెక్టులకు: 125మూడు సబ్జెక్టుల వరకు: 110,మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే: ?110 ం ప్రతి అదనపు సబ్జెక్టుకు 60,ఈ ఫీజు నిబంధనలు ఎస్ ఎస్ సి / ఓ ఎస్ ఎస్ సి/ వొకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులందరికీ వర్తిస్తాయి. విద్యార్థులు గడువు లోపు ఫీజు చెల్లించకపోతే, లేట్ ఫీజుతోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కాబట్టి విద్యార్థులు, పాఠశాలలు సమయానికి చెల్లింపులు పూర్తి చేయాలని అధికారులు సూచించారు.



## సింగరేణి హై స్కూల్ ను సందర్శించిన ఎడ్యుకేషనల్ జి ఎం



**అగ్ని ధార న్యూస్, (రామగుండం):** సింగరేణి ఎడ్యుకేషనల్ (కార్పొరేట్) జీఎం వెంకటాచారి గోదావరిఖని సింగరేణి సెక్టార్–2 ఉన్నత పాఠశాలను సందర్శించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి సందర్శనకు వచ్చిన ఆయనకు శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ అండ్ పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి,హెడ్ మాస్టర్ సంతోష్ కుమార్ పూల బోకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ అండ్ పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి,హెడ్ మాస్టర్ సంతోష్ తో పాటు ఇతర ఉపాధ్యాయులత సమావేశం నిర్వహించారు. సమస్యలను స్కూల్ కు కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు ఉపాధ్యాయుల రికార్డులు పరిశీలించారు. విద్యారతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి ప్రగతి కోసం ఈ విద్యా సంవత్సరం పదవ తరగతిలో వంద శాతం మంచి ఫలితాలు సాధించాలని, అందుకు తగిన సహాయ,సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఒక లక్ష్యం పెట్టుకోవాలని,ఆ లక్ష్య సాధనకోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు.

## రాయిగడ్డలో పారిశుద్ధ్యం పనులు



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు రాయిగడ్డ కాలనీలో శుక్రవారం పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. కంపచెట్లు,పిచ్చి మొక్కలతో ఇబ్బందులు ఎదుర్కొన్న కాలనీవాసులు కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దేవన్న నాయుడు స్పందిస్తూ మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో పరిశుద్ధ పనులు నిర్వహించారు. ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను జెసిబి సాయంతో తొలగించారు ఈ సందర్భంగా దేవన్న నాయుడు మాట్లాడుతూ.. ఆయా కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యలను పరిష్కరిస్తున్నారని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలం సందర్భంగా కంప చెట్లు పిచ్చి మొక్కలతో మరుగు ఏర్పడడంతో విష సర్పాలు సంచరించి ప్రమాదం ఉందని కాలనీవాసులు జాగ్రత్తలు పాటించాలని దేవన్న సూచించారు. కాలనీలోని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని రోగాల బారిన పడకుండా కాపాడుకోవాలని దేవన్న నాయుడు కాలనీవాసులకు సూచించారు. సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే మేఘా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్, కాంగ్రెస్ నేత దేవన్న నాయుడు, మున్సిపల్ సిబ్బందికి రాయిగడ్డ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికీ జైలు శిక్ష తో పాటు జరిమానా

**కల్వకుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** 1) ఇంజమూరి శ్రీరాములు తండ్రి కాషన్న. వయసు 48 కులం అగ్రికల్చర్. గ్రామం కోమటి కుంట. లింగాల మండల్. నాగర్ కర్నూల్ జిల్లా.కి 3 రోజులు జైలు శిక్ష మరియు 600 జరిమానా 2) పెంకుల మధు తండ్రి మల్లయ్య. వయసు 34. కులం బోయ. అగ్రికల్చర్. తుమ్మల పల్లి. వంగూర్ మండల్. నాగర్కర్నూల్ కి 2రోజులు జైలు శిక్ష మరియు 600 జరిమానా 3) మొల్గం రాజేందర్ తండ్రి హన్మంతు గౌడ్. 30 వయసు కులం గౌడ్స్. బుద్దారం. మిడ్జిల్ మండలం. మహబూబ్ నగర్ జిల్లా కి. 1 రోజు 24 గంటలు జైలు శిక్ష మరియు 200 జరిమానా 4)చాపల రమేష్ తండ్రి సాయిలు. వయసు35. కులం. ముదిరాజు. అగ్రికల్చర్. గ్రామం కోనాపూర్. వంగూర్ మండల నాగర్ కర్నూల్ జిల్లా కి. 24 మరియు 600 ఫైన్ జూనియర్ సివిల్ జడ్జి మేడం కావ్య జాడ విధించడం జరిగింది. కల్వకుర్తి సిఐ నాగార్జున మాట్లాడుతూ వాహన చోదకులు ఎవరూ కూడా మద్యం తాగి వాహనాలు నడపరాదు నడిపినచో ఎంతటి వారికైనా శిక్ష తప్పదు, మద్యంకి బానిసై కుటుంబానికి దూరం కాకండి మీ విలువైన జీవితాన్ని పాడుచేసుకోకండి అని తెలిపినారు. ఎస్ఐ కల్వకుర్తి,మాధవ రెడ్డి

## రోజుకు 7 కిలోల బంగారం కొనుగోలు

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు భగ్గుమంటు న్నప్పటికీ.. సెంట్రల్ బ్యాంక్‌లు మాత్రం కొనుగోళ్లను ఆపడం లేదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) 200 కిలోల బంగారాన్ని కొనుగోలు చేసింది. రోజుకు సగటున 7 కిలోల బంగారాన్ని సొంతం చేసుకున్నట్లయ్యింది. ఈ ఏడాది బంగారం ధర 60 శాతం పైగా పెరిగినప్పటికీ.. ఇంత భారీ కొనుగోళుచేయడం గమనార్హం. దీంతో ఆర్‌బిఐ మొత్తం బంగారు నిల్వలు 880 టన్నుల స్థాయిని దాటింది. వీటి మొత్తం విలువ 95 బిలియన్ (దాదాపు రూ.8.34 లక్షల కోట్లు) డాలర్లుగా ఉంది. సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఏకంగా 600 కిలోల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఆర్థిక సంవత్సరం 2024–25 చివరి నాటికి 879.58 టన్నులుగా ఉన్న మొత్తం బంగారం నిల్వలు.. సెప్టెంబర్ చివరి నాటికి 880.18 టన్నులకు చేరింది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పెరుగుతున్న కారణంగా సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారానికి ఇటీవల చాలా డిమాండ్ పెరిగింది. ఈ కారణంగానే అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరిగాయి. ఈ కేంద్ర బ్యాంకులు, పెట్టుబడిదారులు ఆర్థిక ఆస్తిగా బంగారాన్ని నిరంతరం కొనుగోలు చేయడం వలన దేశీయ ధరలు కూడా పెరిగాయి. ఈ డిమాండ్ కారణంగానే సెప్టెంబర్ నెలలో బంగారం ధరలు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి

**పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**




**కరీంనగర్ :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కళాశాల, పాఠశాల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు భారీ సంఖ్యలో హాజరై కలెక్టరేట్ నుండి తెలంగాణ చౌక్ మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.అనంతరం పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రంగోలి, వాల్ పెయింటింగ్, స్లోగన్ రైటింగ్, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని, ఇందులో భాగంగా జిల్లాలో వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువత, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున ఈ అవగాహన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారని తెలిపారు.వివిధ రకాల ఒత్తిళ్ల కారణంగా అనేకమంది డ్రగ్స్ కు బానిసలవుతున్నారని అన్నారు. మత్తు పదార్థం మానసికంగా, శారీరకంగా తీవ్ర నష్టం చేస్తుందని తెలిపారు. సమస్యను పరిష్కరించుకునేందుకు, ఒత్తిళ్లను అధిగమించేందుకు అనేక మార్గాలు ఉన్నాయని అన్నారు. స్నేహితులతో మాట్లాడడం, పుస్తకాలు చదవడం సామాజిక సేవ వంటి వాటితో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. మత్తు పదార్థాల నివారణకు జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విధులు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజా రక్షణ కోసం పోలీసు వ్యవస్థ నిరంతరం పనిచేస్తుందని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు జిల్లాలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. డ్రగ్ సంబంధిత సమాచారం నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం స్వచ్ఛంద సంస్థలు, అధికారులు చేస్తున్న కృషి అభినందనీయ మని అన్నారు. కరీంనగర్ జిల్లాలో ఉన్నతాధికారులు మత్తు పదార్థాల అనర్థాల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వారి భవిష్యత్తును అంధాకారంలోకి నెట్టుతుం దని అన్నారు. విద్యార్థులు, యువత ఒత్తిడిని అధిగమిం చేందుకు స్నేహితులు, తల్లిదండ్రులతో మాట్లాడటం, పుస్తకాలు చదవడం క్రీడలు, ఆటలు ఆడడం వంటివి అలవర్చుకోవాలని అన్నారు. మత్తు పదార్థాల నివారణకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నదని అన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాల నివారణ పై చేసిన నృత్య రూపకం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీసీపీలు వెంకటర మణ, భీమ్ రావ్, డి ఐ ఓ బి గంగాధర్, సిడిపిఓ సబిత, ఎన్ఎంబీఏ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి పాల్గొన్నారు.

# ఒక అవకాశం నవీన్ యాదవ్‌కి ఇవ్వండి

## స్ట్రీట్ కార్నర్ మీటింగ్లో ప్రసంగించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ :** కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు జూబ్లీహిల్స్ అభివృద్ధికి మలుపు అవుతుందని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం నాడు ఆమె బోరబండ సైట్ 3 స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో మాట్లాడారు. మూడు పర్యాయాలు బీఆర్ఎస్ ను గెలిపించారు.. కనీసం మంచినీళ్లు లేవు, డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేదు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నారు. కాబట్టి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలిస్తే జూబ్లీహిల్స్ లో సమస్యలు పరిష్కారం అవుతాయి. ఒక అవకాశం నవీన్ యాదవ్ కి ఇవ్వండి. మీరు నవీన్ యాదవ్ ను ఆశీర్వదిస్తే అభివృద్ధి సంక్షేమం మీ ఇంటికి వస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. ఇండ్లు లేని నాలుగున్నర లక్షల మంది పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసాం. పేదలకు పక్కా ఇండ్లు కట్టి ఇస్తున్నాం. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నాం . టిఆర్ఎస్ హయాంలో కనీసం 10 సంవత్సరాల్లో రేషన్ కార్డు ఇవ్వలేదు . ఒక జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోనే మేము 15 వేల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. 200 యూనిట్ల విద్యుత్ తీస్తున్నాం. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరు చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ను డెవలప్ చేసుకోండి. ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోనే 150 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. పేదలకు సంక్షేమము ఉండాలంటే కాంగ్రెస్ అనే సాధ్యం . కన్నీళ్లు కావాలంటే టిఆర్ఎస్కు ఓటెయ్యండి.. ఇల్లు కావాలంటే కాంగ్రెస్కు ఓటెయ్యండి. ఇందిరమ్మ కాలం నుంచి ఈ ప్రాంతంలో అభివృద్ధి చేసింది కాంగ్రెస్సే. భవిష్యత్తులో కూడా అభివృద్ధి చేసేది కాంగ్రెస్సే . చేయి గుర్తుకు ఓటేసి నవీన్ యాదవ్ని గెలిపించాలని అన్నారు. నవీన్ యాదవ్ మీద టిఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్ వాళ్ళు తప్పుడు కూతలు కూస్తున్నారు . నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ ప్రచార రథం ఇస్తేనే కెసిఆర్ పార్టీ పెట్టారు. తొలి నాళ్లలో టిఆర్ఎస్ ప్రచారానికి నవీన్ యాదవ్ కుటుంబ డబ్బులు వాడుకున్నారని అన్నారు. ఇప్పుడు నవీన్ యాదవ్ పై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. అన్నం పెట్టిన చెయ్యికి సున్నం పెట్టడం కేసీఆర్ కుటుంబ నైజం . నాడు చిన్న శ్రీశైలం యాదవ్ కుటుంబాన్ని వాడుకొని ఇప్పుడు విమర్శలు చేస్తే ప్రజలు క్షమించరు. టిఆర్ఎస్ పార్టీలో రౌడీ షీటర్లు చేరారు . బాలికలను వేధించిన, చిన్న పిల్లలను ఇబ్బంది పెట్టిన వ్యక్తులను టిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. రౌడీ షీటర్లకు స్వయంగా కేటీఆర్ దండేసి దండం పెట్టి కాళ్ళు మొక్కుతున్నారని అన్నారు. కానీ ఒకప్పుడు కెసిఆర్ కు అండగా నిలిచి ఆర్థిక సహాయం ఆదరించిన చిన్న శ్రీశైలం యాదవ్ కుటుంబంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారు. సెంటిమెంట్ కాదు.. డెవలప్మెంట్ కావాలి. కెసిఆర్ సొంత కూతురు కవిత ను వేధించి బయటకి పంపారు. సొంత ఆడబిడ్డ కవితనే ఓర్వలేని కేటీఆర్ ఇతర ఆడబిడ్డలను సహిస్తారా . ఈ గల్లీలో పుట్టి పెరిగిన నవీన్ యాదవ్ని గెలిపించండి . నవీన్ యాదవ్ ను గెలిపించడం మూలంగా సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంది. నవీన్ యాదవ్ గెలుపుతోనే మన వీధుల్లో గల్లీలో బస్తీల్లో అభివృద్ధి సాధ్యపడుతుంది. చేసిన అభివృద్ధి ఏది లేక...బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని నమ్ముకుంది. టిఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొడుతున్నారు . నవీన్ యాదవ్ గెలవడం ఖాయం అయింది.. మెజారిటీ తేలాల్సి ఉందని అన్నారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను విమర్శించే స్థాయి గాదరి కిషోర్‌కు లేదు

**క్షమాపణలు చెప్పకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయి**

**పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్**

**పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ శవయాత్ర**

**గాధరి కిషోర్ దిష్టిబొమ్మను దహనం చేసిన మండల కాంగ్రెస్ నాయకులు**



**పెగడపల్లి (ధర్మపురి):** తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను విమర్శించే స్థాయి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కు లేదని పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, మండల ఎస్సీ సెల్ నాయకులు విమర్శించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఎస్సీ సెల్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ పై బుధవారం బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ చేసిన వాఖ్యలను నిరసిస్తూ ఎస్సీ సెల్ నాయకులతో కలిసి మండల కాంగ్రెస్ నాయకులు శవయాత్ర నిర్వహించి, దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమం జరుగుతున్న సమయంలో ఆంధ్ర నాయకుల సంకలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ ప్రస్తుత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేరాడని అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విమర్శించడాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ... ఆంధ్ర నాయకులకు కాంట్రాక్టులు ఇచ్చి కమిషన్ల కోసం సంక నాకింది మీ నాయకుడు కేసీఆర్ కాదా అంటూ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ అనంతరం దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చేయకుండా మోసం చేసినప్పుడు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని మోసం చేసినప్పుడు, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తానని మోసం చేసినప్పుడు, దళిత బంధు పేరిట దగా చేసినప్పుడు, మీ ఆత్మ గౌరవం ఏమైందని అంటూ గాదరి కిషోర్ చేసిన వాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు, ఎస్సీ సెల్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి స్థానిక అంబేద్కర్ చౌరస్తా వరకు దిష్టి బొమ్మతో శవయాత్ర చేపట్టి, దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, ఏఎంసి గొల్లపల్లి మాజీ చైర్మన్ ఓరుగల శ్రీనివాస్, నంచర్ల పిఏసిఎస్ మాజీ చైర్మన్ అమిరిశెట్టి లక్ష్మి నారాయణ, మాజీ ఎంపిటిసి కడారి సుప్రియ–తిరుపతి, నంచర్ల మాజీ సర్పంచ్ గోలి మహేందర్ రెడ్డి, ఎస్సి సెల్ అధ్యక్షులు తడగొండ తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు చెట్ల కిషన్, శ్రీరాం అంజయ్య, మాజీ సర్పంచ్ రవినాయక్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తడగొండ రాజు, బొడ్డు రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు దీకొండ మహేందర్, నాంపెల్లి దుర్గాప్రసాద్, బొమ్మేన దయాకర్, బాలే అంజయ్య, మొదుంపెల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యల పరిష్కారానికై అమృత్ 2.0

**అమృత్ 2.0 పథకంతో మున్సిపాలిటీల అభివృద్ధి**

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్**

**జగిత్యాల :** అమృత్ 2.0 పథకం తెలంగాణ లో నీటి సరఫరా, తోపాటు మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన జాతీయ పథకం అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో జెడి.అశ్విని, డిటిసిపి.ఏడి.జ్యోతి, సంబంధిత అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూఅటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ (ఏఎంఆర్యుటీ) పథకం ద్వారాప్రతి ఇంటికి కుళాయి ద్వారా నిరంతరాయంగా నీటి సరఫరాను అందించాలని, మురుగునీటి శుద్ధి, పారుదల వ్యవస్థలను మెరుగుపర్చి పట్టణ జీవన ప్రమాణాలను పెంపొందించాలనే అమృత్ 2.0 పథకం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సయుక్తంగా అమృత్ 2.0 పథకం ప్రాజెక్ట్ లను నిర్వహిస్తున్నాయిని తెలిపారు.ఈ పథకాన్ని సక్రమంగా వినియోగించుకున్నట్లయితే పచ్చదనం,బహిరంగ ప్రదేశాలను, పార్కులను అభివృద్ధి చెంది పట్టణాల సౌకర్యాల విలువలు పెరుగుతాయాని తెలిపారు.దేశంలోని నగరాలను, పట్టణాలను స్వయం సమృద్ధిగా, నీటి సురక్షిత పట్టణ కేంద్రాలుగా మార్చే దిశగా ఈ పథకం ముందుకు సాగుతుందని తెలిపారు .దాదాపు 500 నగరాల్లో మురుగు నీటిపారుదల, సెప్టేజ్ నిర్వహణ యొక్క సార్వత్రిక కవరేజ్, నీటి వనరుల పునరుజీవనం మరియు పచ్చని ప్రదేశాల అభివృద్ధి వంటి కీలక రంగాలపై దృష్టి సారించగా పట్టణ మౌళిక సదుపాయాలను ఆధునీకరించడం మరియు నీటి భద్రతను పెంచడం అమృత్ 2.0 లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలోగల చెరువులు, నాళాలను సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.చెరువుల యొక్క ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలను నిత్యం పరిశీలించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నాణ్యత తో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు.శుక్రవారం జగిత్యాల జిల్లాలోని కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు గ్రౌండింగ్ చేసి పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరుపేదలైన లబ్ధిదారులకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణాలు అందజేసే విధంగా చూడాలని తెలిపారు.ఇండ్ల నిర్మాణాలకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని లబ్ధిదారులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం 400 చదరపు అడుగుల లోపు స్థలం ఉన్నవారు జి ప్లస్ వన్ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణం చేపట్టే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ప్రజలకు తెలిపాలని అధికారులకు సూచించారు.పనులు సకాలంలో పూర్తిచేసి బిల్లులు త్వరగా పొందాలని లబ్ధిదారులకు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఉచితంగా అందిస్తుందని, రవాణా ఖర్చులు కూలీల ఖర్చులు లబ్ధిదారులే చెల్లించాలని తెలిపారు.జగిత్యాల పట్టణంలో ఇసుక బజార్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని లబ్ధిదారులు వినియోగిచుకోవాలని తెలిపారు.నాణ్యత లోపించకుండా సకాలంలో పనులు పూర్తిచేయాలనీ తెలిపారు.లబ్ధిదారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తిచేసి బిల్లులు పొందాలని, నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు.ప్రతి ఇంటి బేస్మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్ల ప్రగతిని, అలాగే పూర్తయిన ఇండ్ల ఫినిషింగ్ వారం వారం రిపోర్టు లను, టార్గెట్ ప్రకారం ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని అన్ని యూనిట్స్ ఫాలో కావాలని అధికారులను ఆదేశించారు ఈ పర్యటనలో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, ఎమ్మార్వో వినోద్ కుమార్, ఎంపీడీవో శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక భద్రత చర్యలు!

**సిద్దిపేట :** సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్ యం. విజయ్ కుమార్, ఆదేశాల మేరకు, ట్రాఫిక్ పోలీసులు మరియు హెచ్‌కెఆర్ హైవే అథారిటీ సిబ్బంది సహకారంతో రాజీవ్ రహదారిపై చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్టు కొమ్మలు వాహనదారులకి ఇబ్బందికరంగా మారడంతో, సురక్షిత రవాణా కోసం ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట ట్రాఫిక్ సుమన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిఐ ప్రవీణ్ కుమార్, హెచ్‌కెఆర్ హైవే అథారిటీ ఏఈ రవీందర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వంటిమామిడి నుండి రామక్కపల్లి వరకు రాజీవ్ రహదారిపై ఉన్న చెట్ల కొమ్మలను క్రేన్ సహాయంతో కట్ చేసి తొలగిస్తున్నారు.ఈ సందర్భంగా ఏసీపీ సుమన్ కుమార్ మాట్లాడుతూ. వాహనదారుల భద్రత దృష్ట్యా రాజీవ్ రహదారిపై ప్రమాదాలకు కారణమయ్యే చెట్ల కొమ్మలను తొలగించడం అత్యవసరమని గుర్తించి ఈ రోజు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం. సీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, లైటింగ్ సదుపాయాలు మరియు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని హెచ్‌కెఆర్ హైవే అధికారులను కోరాం అని తెలిపారు.అలాగే రాత్రి వేళల్లో లైటింగ్ లేకపోవడం వలన జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు, హెచ్‌కెఆర్ హైవే అథారిటీతో సమన్వయం చేసుకొని కావాల్సిన లైటింగ్ సదుపాయాలు మరియు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

## కావేరి విశ్వవిద్యాలయం, కావేరి సీడ్ కంపెనీని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**సిద్దిపేట :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ శుక్రవారం వర్గల్ మండలంలోని కావేరి యూనివర్సిటీ మరియు కావేరి సీడ్స్ కంపెనీని సందర్శనకు రాగ జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ రెండు సంస్థలు తమ తమ రంగాలలో సాధించిన అసాధారణ పురోగతి, విజయాలు, పరిశోధన మరియు అభివృద్ధి ఖీడఆ, కార్యక్రమాలను యూనివర్సిటీ చాన్సిలర్ జీ.వి. భాస్కరరావు, వైస్ ఛాన్సర్ డాక్టర్ వి. ప్రవీణ్ రావు, సమక్షంలో ఈ సందర్శన సందర్భంగా గవర్నర్ పరిశీలిస్తూ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిశోధకులను కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా గవర్నర్ విద్యార్థులు సమాజ మార్పుకు దిక్సూచిలా ఉండాలని, విజ్ఞానాన్ని వినియోగించి వ్యవసాయ ఉత్పత్తిని, సాంకేతికతను మరియు పరిశోధనలను అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగంలో తీసుకుంటున్న కార్యక్రమాల గురించి గవర్నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మొదట కావేరి యూనివర్సిటీని సందర్శించి యూనివర్సిటీ ప్రొఫైల్ ను పరిశీలించారు. తదుపరి ఎంటమాలజీ , పాథాలజీ, సాయిల్ సైన్స్,బ్రీడింగ్, ఫిజియోలజీ ల్యాబ్స్ ను మరియు విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్లో వివిధ రకాలైన డ్రోన్ టెక్నాలజీ, రోబో టెక్నాలజీ, 3డి ప్రింటింగ్ ఏ.ఆర్ & వి.ఆర్ మోడల్స్, మరియు అగ్రికల్చరల్ ఇన్నోవేషన్స్ ఆయన పరిశీలించారు. తర్వాత గవర్నర్ వర్మి కంపోస్ట్ కార్యక్రమాలను పరిశీలించి నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ రీసెర్చ్ సెంటర్లో టిష్యూ కల్చర్, జినోమిక్స్, స్పీడ్ బ్రీడింగ్, ప్లాంట్ హెల్త్ ల్యాబ్స్, జీన్ బ్యాంక్ లను సందర్శించి ఇవి చాలా అదునాతనంగా ఉన్నాయని అభినందించారు. కావేరి యూనివర్సిటీ చాన్సలర్ మాట్లాడుతూ. గవర్నర్ సందర్శన విశ్వవిద్యాలయానికి ఒక గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల మొత్తం అభివృద్ధి కోసం విశ్వవిద్యాలయం తీసుకుంటున్న ప్రతిపాదనలు మరియు పథకాలను వివరించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ. కావేరి యూనివర్సిటీ పరిశోధనలో కొత్త దారిని చూపించడానికి కట్టుబడి ఉందని, కావేరి సీడ్స్ కంపెనీతో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయ రంగానికి ఒక మనోబలం కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో వి.చంద్రకళ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com